PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 250 | విజయవాడ, సోమవారం 15 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Monday 15 April 2024 | Rs



సాల్ట్ చితక్కొట్టాడు

8

- కోల్‌కత చేతిలో లక్నో చిత్తు
- రాణించిన మిచెల్ స్టార్క్, నరైన్
- లక్నో 161/7, కోల్‌కత 162/2



పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము (వార్త 7లో)



గాజువాక సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు



సభలో ఒక కార్యకర్త చూపుతున్న రాయి



జనసేన కార్యకర్తల దాడిలో గాయపడిన దిలీప్

చంద్రబాబు, పవన్ పర్యటనలో

రాయి కలకలం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి, గుంటూరు ప్రతినిధులు

విశాఖ జిల్లాలో టిడిపి అధినేత చంద్రబాబు, గుంటూరు జిల్లాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటనల్లో రాళ్ల కలకలం రేగింది. వీరిపై రాళ్ల దాడి ప్రచారం వైరల్ అయింది. విశాఖ జిల్లా గాజువాకలో ఆదివారం సాయంత్రం చంద్రబాబు 'ప్రజాగళం' సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తి విసిరిన రాయి సభా వేదిక దగ్గరగల బారికేడ్ల వద్ద పడింది. దీంతో, కొద్ది నిమిషాల సేపు చంద్రబాబు తన ప్రసంగాన్ని నిలుపుదల చేశారు. పోలీసులు రాయి పడినట్లు చెప్తున్న చోటుకు వెళ్లి పరిశీలించారు. అయితే, బారికేడ్ల కిందిన మాత్రమే రాళ్లు ఉన్నాయి. అక్కడికి సమీపంలో ఎవరైనా ఉన్నారేమోనని వెతకారు. ఎవరూ కనిపించలేదు. ఈ తర్వాత చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో ఈ రాయినే చంద్రబాబుపైకి విసిరారంటూ ఒక టిడిపి కార్యకర్త ఒక రాయినిపైకి ఎత్తి చూపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వారాహి యాత్ర నిర్వహిస్తున్న పవన్ కల్యాణ్ హెలికాప్టర్లో తెనాలిలోని సుల్తానాబాద్ చేరుకున్నారు. సుల్తానాబాద్ నుంచి బహిరంగ సభ స్థలం గాంధీ మార్కెట్‌కు ర్యాలీగా వెళ్తున్నారు. ఈ ర్యాలీకి వచ్చిన మామిళ్లపల్లికి చెందిన జనసేన కార్యకర్త దిలీప్ ఒక యువతి పట్ల సుల్తాన్‌బాద్‌లోని ఉషోదయ కల్యాణ మండపం వద్ద అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం తెలిసి ఆ యువకుడిని యువతి తండ్రి నిలదీశారు. ఈ సమయంలో అటుగా ర్యాలీగా వస్తున్న జనసేన కార్యకర్తలు దిలీప్‌ను కొట్టారు. దీంతో, ఆ యువకుడు వారిపై రాయి విసిరినట్లు అక్కడివారు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో అటుగా వస్తున్న జనసేన కార్యకర్తలు పవన్ కల్యాణ్‌పైనా ఆ యువకుడు రాయి విసిరాడని భావించి దేహశుద్ధి చేశారు. దీంతో, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువతి తండ్రిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొరపాటు తన చెయ్యి యువతికి తగిలిందని దిలీప్ వివరణ ఇచ్చాడు.

రాయిపై ఇంటెలిజెన్స్ వర్గాలేమంటున్నాయంటే!

'మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సభ చుట్టుపక్కల బలగాలతో ఇళ్లపైనా బందోబస్తు ఏర్పాటు చేశాం. బాబు ప్రసంగిస్తున్న స్టేజీకి ఎడమవైపునగల ఒక చెట్టువద్ద అలికిడి జరిగితే అంతా రాయి రాయి అంటూ అరిచారు. మేమెళ్లి చూశాము. అక్కడేమీ కనిపించలేదు. ఒక రాయి చెట్టుపైనుంచి స్టేజీ వద్ద ఇనుప బారికేడ్లకు తగిలిందని చెప్పడంతో అక్కడ చూశాం. బారికేడ్లకు కింద స్టేజీ కోసం కొన్ని పలక లాంటి రాళ్లు పెట్టినవి మినహా ఇంకెలాంటి రాళ్లు లేవు' అని ఇంటెలిజెన్స్ పోలీసులు తెలిపారు.

జగన్‌ను వదిలించుకోవాలని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు : చంద్రబాబు

గాజువాకలో జరిగిన 'ప్రజాగళం' సభలో చంద్రబాబు మాట్లాడుతూ తనపై బాంబులు పడితేనే భయపడలేదని రాళ్లు ఒక లెక్కా ? అని అన్నారు. తెనాలి వారాహి సభలో పవన్ కల్యాణ్‌పై వేశారని, ముఖ్యమంత్రిపై శనివారం చీకట్లో గులకరాయి పడిందని, ఇప్పుడు తనపై వెలుగులో రాయి పడిందని చెబుతూ ఇవన్నీ విజయవాడలో చేసినట్లు బ్లేడు బ్యాచ్‌తో చిల్లర రాజకీయాలు జగన్ చేస్తున్నాడంటూ దుయ్యబట్టారు. గులకరాయికే ముఖ్యమంత్రి అంత గగ్గోలు పెడుతున్నాడంటూ చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఈ ఘటన మిగతా 7లో

రాయి దాడి ఘటనపై దర్యాప్తునకు

ఆరు ప్రత్యేక బృందాలు

ఎస్‌పి నేతృత్వం • అనుభవజ్ఞుడే కొట్టినట్లు ప్రాథమిక అంచనా • హత్యాయత్నం కేసు నమోదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో శనివారం జరిగిన రాయి దాడి ఘటనపై విచారణకు ఎస్‌పి ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణ టాటా ఆదివారం వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పర్యటన జరుగుతున్న సమయంలో పక్కనే ఉన్న భవనం నుండి రాయి వచ్చిందని, అనుభవజ్ఞుడైన వ్యక్తే దాడిచేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. సంఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న సెల్‌టవర్ల నుండి వెళ్లిన సిగ్నళ్ల ఆధారంగా సుమారు 20 వేల ఫోన్ నెంబర్లను పోలీసులు సేకరించారు. వాటిపైనా విచారణ జరుపుతున్నారు. చుట్టుపక్కల మూడు టవర్ల పరిధిని పరిశీలించి కచ్చితంగా దాడిచేసిన ప్రాంతంలో ఉన్న ఫోన్ నెంబర్లను సేకరించనున్నారు. దాడి ఘటనపై విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులు విచారణ అనంతరం 307 సెక్షన్ కింద సింగ్‌నగర్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. దాడిలో ఆయన కంటికి గాయమైంది. సంఘటన జరిగిన ప్రాంతం జనసమర్థమైనది కావడం ఆ చుట్టుపక్కల సిసి కెమెరాలు ఉన్నందున ఒకటీ రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే ముఖ్యమంత్రికి తగిలిన రాయి అంతే వేగంగా పక్కనే ఉన్న వ్యక్తికీ తగిలింది. రాయి సమాంతరంగా వచ్చింది కనుక భవనంలో నుండే వచ్చి ఉంటుందని చెబుతున్నారు. దీనిపై సిఎం రక్షణ వ్యవహారాలు చూసే ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యు)ను ఎన్నికల కమిషన్ నివేదిక అడిగింది. సిఎం వాహనం వెళ్లేరూట్లో ముందుగానే భవనాలు ఎన్ని ఉన్నాయి. ఎక్కడ పోలీసు సిబ్బందిని పెట్టాలి, ఖాళీ స్థలాలు ఉన్నాయా, వాటిల్లో ఎవరైనా ఉంటారా? అక్కడ ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ముందుగానే పోలీసులు రెక్కీ నిర్వహిస్తారు. కనీస భద్రతా చర్యలు తీసుకుంటారు. ప్రతి భవనంలోనూ, పైనా పోలీసు సిబ్బందిని ముందు జాగ్రత్త చర్యగా నియమిస్తారు. సంఘటన జరిగిన సమయంలో అలాంటి ఏర్పాట్లు చేశారా? లేకపోతే ఎందుకు చేయలేదు అనే కోణంలోనూ ఉన్నతాధికారులు, ప్రత్యేక బృందం అధికారులు విచారణ జరపనున్నారు. అలాగే సిఎం పర్యటించే సమయంలో విద్యుత్ లేకపోవడంపైనా విచారణ జరుపుతున్నారు. ఆ ప్రాంతంలో కరెంటు తీగలు తక్కువ ఎత్తులో ఉండటం సిఎంకు తగిలే అవకాశం ఉందని, అందువల్లే కరెంటు తీశామని విద్యుత్ అధికారులు చెప్పినట్లు తెలిసింది. దాడి ఘటనను ఎన్నికల కమిషన్ కూడా సీరియస్‌గా తీసుకుంది. మరోవైపు దాడి ఘటనపై వైసిపి, మిగతా 2లో



కేసరపల్లిలో సిఎం జగన్ బస చేసిన ప్రాంతంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్‌పి అద్నాన్ నయీం

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు?

విజయవాడ: ముఖ్యమంత్రిపై రాయి దాడి ఘటనలో ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాయి విసిరిన దుండగుడితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు సమాచారం. రాయి విసిరిన దుండగుడిని రౌడీషీటరుగా గుర్తించారు. పథకం ప్రకారమే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిసింది. సిఎం యాత్రను కిలోమీటరు దూరం నుంచి వాళ్లు అనుకరిస్తూ వచ్చినట్లు సమాచారం. ఘటన జరిగిన స్కూల్ - గంగానమ్మగుడి మధ్య ఉన్న గోడ ప్రాంతంలోని ఓ చెట్టు మాటు నుంచి రాయి విసిరినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిసింది.



ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్‌పైకి దూసుకెళ్తున్న ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు

కాన్సులేట్‌పై దాడికి ఇరాన్ ప్రతీకారం

- ఇజ్రాయిల్ పై డ్రోన్లు, క్షిపణులతో దాడి
- జి7 దేశాల ఖండన

టెల్‌అవీవ్: సిరియాలోని తమ దౌత్య కార్యాలయంలో ఇద్దరు జనరల్స్‌తో సహా ఏడుగురు సైనిక అధికారులను హతమార్చిన యూదు రాజ్యం దాడికి ప్రతీకారంగా ఇరాన్ డజన్ల కొద్దీ క్షిపణులు, కమికేజ్ డ్రోన్లతో ఆదివారం తెల్లవారు జామున దాడులు చేసింది. టెల్ అవీవ్, పశ్చిమ జెరూసలెం సహా ఇజ్రాయిల్ అంతటా పేలుళ్ల శబ్దాలు, వైమానిక దాడుల సైరన్లు వినిపించాయని వార్తా సంస్థలు తెలిపాయి. ఇజ్రాయిల్ రక్షణ బలగాల ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియర్ హగారియా ఈ విషయాన్ని ఆదివారం నాడిక్కడ మీడియాకు వివరించారు. ఇరాన్ ప్రయోగించిన 300కిపైగా క్షిపణులు, డ్రోన్లలో 99 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకోక ముందే తాము కూల్చేశామని అన్నారు. డమాస్కస్‌లోని తమ కార్యాలయంపై ఈ నెల1న ఇప్రాయిల్ జరిపిన వైమానిక దాడికి వన్ టైమ్ పనిష్మెంట్ పూర్తి చేశామని ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖొమేనీ వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ మరోసారి ఇటువంటి తప్పు చేయకుండా ఉండేందుకు ఇదొక హెచ్చరిక అని మిగతా 7లో

ఎంఎస్‌పి ఊసెత్తని బిజెపి

- నిరుద్యోగ యువత ఆకాంక్షలు లేవు
- 'సంకల్ప్ పత్ర' పేరుతో 2024 మేనిఫెస్టో విడుదల



అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, నిర్మలమ్మతో కలిసి మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అన్నదాతలకు గతంలో వాగ్దానం చేసిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఉసే లేకుండా బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం నాడిక్కడ విడుదల చేసింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గత సారి ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ఈ సారి దీనిపై పూర్తిగా మౌనం వహించింది. రైతుల సంక్షేమమే ధ్యేయమని రొటీన్ డైలాగులు వల్లించింది. అలాగే దేశం ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య నిరుద్యోగం గురించి పట్టించుకోలేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన బిజెపి ఈసారి యువతను మభ్య పెట్టే మాటలతో సరిపుచ్చింది. సంకల్ప్ పత్ర' పేరుతో 14 అంశాలతో కూడిన బిజెపి మేనిఫెస్టోను ఆదివారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డాతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, బిజెపి ఆలోచన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమేనని అన్నారు. తమ పాలనలో అభివృద్ధి, సంస్కృతికి రెండింటికీ ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. మానవ కల్యాణం, ప్రపంచ హితం కోసం ఎప్పుడూ ముందుంటామని అన్నారు.దేశాభివృద్ధికి అవినీతి ఆటంకంగా మారిందన్నారు. నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్రకు పునాదులు వేశామన్నారు. యువశక్తి, నారీశక్తి, గరీబ్, కిసాన్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిని తయారు చేశామని తెలిపారు. బిజెపి, ఆరెస్సెస్ మతతత్వ ఎజెండాలో భాగమైన యుసిసిని అమలు చేస్తామని ఈ మ్యానిఫెస్టోలో గొప్పగా ప్రకటించింది. అలాగే వన్ నేషన్ వన్ ఎలక్షన్ తీసుకొస్తామని చెప్పింది. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని బిజెపి మేనిఫెస్టోలో పేర్కొంది. పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, పెట్రోలు వినియోగాన్ని అవకాశం మిగతా 7లో

ఇది జుమ్లా పత్రం : ప్రతిపక్షాల విమర్శ

ఇది సంకల్ప్ పత్రం కాదు, జుమ్లా పత్రం (అబద్ధాల పత్రం) అని ప్రతిపక్షాలు విమర్శించాయి.ప్రధాని ఇచ్చిన గ్యారంటీలు వట్టి అబద్ధాలేనని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో అధికారంలో ఉండి కూడా ఒక్క హామీ కూడా నెరవేర్చని బిజెపి ఇప్పుడు ఉత్తుత్తి హామీలతో మరోసారి ప్రజలను మోసగించాలని చూస్తోందని వారు అన్నారు.



పాణ్యం బరిలో గౌస్ దేశాయ్

- సిపిఎం ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లా పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా డి గౌస్ దేశాయ్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'కాంగ్రెస్, సిపిఐలతో సీట్ల సర్దుబాటులో భాగంగా పోటీ చేస్తున్న నంద్యాల జిల్లా పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపి(యం) అభ్యర్థిగా గౌస్ దేశాయ్‌ని నిర్ణయించాము' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కెనడాలో భారత విద్యార్థి కాల్చివేత



చిరాగ్

ఒట్టావా, న్యూఢిల్లీ : కెనడాలో భారతీయ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లిన 24 ఏళ్ల చిరాగ్ అంటిల్ వాంకోవర్ సిటీలో ఈ నెల 12 వతేదీ రాత్రి 11 గంటల సమయంలో కారులో వెళ్తుండగా గుర్తుతెలియని దుండగులు కాల్చిచంపారు. విద్యార్థి హత్యకు గురైన విషయాన్ని సౌత్ వాంకోవర్ పోలీసులు వెల్లడించారు.'కాల్పుల శబ్దం వినిపించినట్లు ఈస్ట్ 55 అవెన్యూ నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూడగా.. కారులో చిరాగ్ మరణించి ఉన్నాడని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎవర్నీ అరెస్టు చేయలేదు' అని వాంకోవర్ పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హర్యానాకు చెందిన చిరాగ్ 2022 సెప్టెంబరులో వాంకోవర్‌కు వచ్చారు. ఇటీవలే కెనడా వెస్ట్ యూనివర్శిటీ నుంచి ఎంబిఎ పూర్తి చేశారు. తాజాగా వర్క్ పర్మిట్‌ను సంపాదించారు. చిరాగ్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకువచ్చేందుకు క్రౌడ్‌ఫండింగ్ చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న మోడీ
- సీతారాం ఏచూరి

7

పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు

- నేడు 170 మండలాల్లో వడగాడ్పులు!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సోమవారం 170 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. 31 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీయనుండగా.. 139 మండలాల్లో అతి తీవ్ర స్థాయిలో ఈ వడగాడ్పులు ఉంటాయని పేర్కొంది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కొనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని మండలాల్లో ఈ వడగాడ్పుల ప్రభావం ఉండ నుంది. మంగళవారం కూడా 146 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని ఆ సంస్థ తెలిపింది. కాగా, ఆదివారం నంద్యాల జిల్లా గోస్పాడులో అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మన్యం జిల్లా నవగాం, విజయనగరం జిల్లా తుమ్మికాపల్లి, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 43.3 డిగ్రీల చొప్పున, వైఎస్‌ఆర్ జిల్లా సింహాద్రిపురం, అనకాపల్లి జిల్లా దేవరపల్లిలో 42.4 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఘాటెక్కిన ఆవకాయ!

ఆకాశాన్నంటుతున్న మామిడి కాయలు, కారం, నూనె ధరలు • పచ్చడి మెతుకులకూ జనం దూరం



మామిడికాయలను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆవకాయ తయారీలో వాడే మామిడికాయలు, కారం, నూనె, ఆవపిండి, వెల్లుల్లి వంటి వాటి ధరలు గతంలో ఎన్నడూ లేని రీతిలో అనూహ్యంగా పెరగడంతో సామాన్యులే కాదు... ధనికులు సైతం వామ్మో అంటున్నారు. వంద కాయల పచ్చడికి రూ.8,500 వరకూ వెచ్చించాల్సి వస్తోంది. తెలుగువారికి ఎంతో ప్రియమైన వాటిలో ఆవకాయ పచ్చడి ఒకటి. పేద, ధనిక తేడా లేకుండా వేసవి సీజన్ వచ్చిందంటే ఏడాదికి సరిపడా నిల్వ పచ్చడి తయారు చేసుకోవడం ఆనవాయితీ. కూరగాయల ధరలు అందుబాటులో లేనప్పుడు, ఉపాధి లేని రోజుల్లో పల్లెల్లో, పట్టణాల్లో శ్రమ జీవులు ఆవకాయ పచ్చడితో కడుపునింపుకుంటారు. ఏడాది పాటు నిల్వ ఉండడంతో ఈ పచ్చడి తయారీపై అత్యధిక మంది మక్కువ చూపిస్తుంటారు. అటువంటి ఆవకాయ ఈ సీజన్లో మండిపోతోంది. పెరిగిన ధరల నేపథ్యంలో సామాన్యులు ఈ ఏడాది ఆవకాయ పచ్చడి తయారీకి దూరంగా ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో చిన్న, పెద్ద రసాలు రకం మామిడి కాయలను ఆవకాయ తయారీకి వాడుతుంటారు. ఎక్కువ కాలం ముక్క మెత్తబడకుండా ఉండేందుకు కాయ కొనుగోలులో రాజీపడరు. గతంలో ఈ రకం కాయ సైజును బట్టి రూ.10 నుంచి రూ.15 ఉండేది. ప్రస్తుతం రూ.20 నుంచి రూ.30 వరకూ ధర పలుకుతోంది. రాబోయే రోజుల్లో ఇంకా ధరలు పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత ధరల ప్రకారం వంద కాయలు కొనాలంటే రూ.3 వేల వరకూ ఖర్చవుతోంది. బ్రాండెడ్ కారం కేజీ ప్రస్తుత ధర రూ.750పైనే ఉంది. వంద కాయలు పచ్చడి పెట్టాలంటే మూడు నుంచి నాలుగు కేజీల కారం అవసరం. అంటే, కారానికి మరో రూ.3 వేల వరకూ ఖర్చవుతుంది. వెల్లుల్లి కిలో రూ.300, ఆవాలు కిలో రూ.100, మెంతులు కిలో రూ.100, ఉప్పు కిలో రూ.20లకు చేరాయి. ఐదు కిలోల వేరు శనగ (గానుగ) నూనె కిలో రూ.210 ఉంది. మొత్తం రూ.1,050 ఖర్చు అవుతోంది. గతేడాదితో పోల్చితే రూ.1,500 వరకూ ఖర్చు పెరిగింది. వేరుశనగ నూనె గతేడాది కిలో రూ.160, వెల్లుల్లి కేజీ రూ.70 నుంచి రూ.100, కారం కేజీ రూ.350లోపు ఉంది. మెంతులు, ఆవాలు రేట్లు కూడా రూ.200 నుంచి 250 ఉన్నాయి.

ఈ ఏడాది పచ్చడికి దూరం

కూరలేకపోయినా పర్వాలేదు. అవకాయ పచ్చడి ఉంటే చాలు. అన్నంతో కడుపు నింపేసుకునేవాళ్లం. ఏటా ఏప్రిల్, మే నెల వచ్చిందంటే పచ్చడి తయారు చేసి సంవత్సరానికి సరిపడా నిల్వ ఉంచుకుంటాము. ప్రస్తుతం 50 కాయల పచ్చడికి రూ.4 వేలు ఖర్చవుతుంది. మరో రెండు వారాలు దాటితే పచ్చడి కాయలు దొరికే పరిస్థితి లేదు.

- ఒనుగులమ్మ, కార్మికురాలు, లాలాచెరువు, రాజమహేంద్రవరం

ఎన్నడూ లేనంతగా ధరలు పెరిగాయి

గత 30 సంవత్సరాలుగా ఆవకాయ పచ్చడి తయారు చేస్తున్నాను. హైదరాబాద్‌లో స్థిరపడిన కూతురు, కోడలికి పంపిస్తుంటాను. కొంత పచ్చడి మేము ఉంచుకుంటాం. ఈ ఏడాది ధరలు విపరీతంగా పెరిగాయి. నిల్వ పచ్చడి కావాలంటే సరుకులు నాణ్యంగా ఉండాలి. వంద కాయల పచ్చడికి రూ.8,500 వరకూ అవుతుంది. అంత వెచ్చించలేక 25 కాయలకే పరిమితమయ్యాను.

-బి.రమాదేవి, గృహిణి, ఆర్యాపురం

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విరమించుకోవాలి



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1158వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో కూర్చున్నవారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటుపరమైతే రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు, మహిళలు, వికలాంగులకు తీవ్ర అన్యాయం జరగనుందని తెలిపారు. దేశాభివృద్ధికి మరిన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పించాల్సిందిపోయి ఉన్న వాటిని అమ్మేయాలని చూడడం దుర్మార్గమన్నారు. తొలుత దీక్షా శిబిరంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, వైసిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఎన్నేటి రమణ, వైఎస్ఆర్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై మస్తానప్ప పాల్గొన్నారు.

500 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గూడవల్లి వద్ద లారీలో తరలిస్తున్న 500 కిలోల గంజాయిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడవల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో వైజాగ్ నుంచి చెన్నైకి వెళ్తున్న లారీలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సతీష్, విఆర్ఓ పి.శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పిరికిపంద చర్య

- జగన్‌పై దాడిని ఖండించిన సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాటికి నిలువలేక ప్రతిపక్షాలు పిరికిపంద చర్యలకు దిగాయని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌పై దాడి అనంతరం భుజాలు తడుముకోవడం చూస్తుంటే ప్రతిపక్షాలే దాడిచేయించాయని కచ్చితంగా భావించాల్సి వస్తుందని అన్నారు. ఇలాంటి దాడులకు బెదిరి వెనక్కు తగ్గేది లేదని వివరించారు. దాడి ఘటనతో టిడిపి బృందానికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని తేలిందని పేర్కొన్నారు. జగన్‌కు గాయ బలంగా తగిలిందని, కింద తగిలి ఉంటే కన్ను పోయేదని అన్నారు. అదే రాయి పక్కన ఉన్న వెలంపల్లి శ్రీనివాస్‌కు కూడా తగిలిందని తెలిపారు. అది క్యాట్‌బాల్ లేదా ఎయిర్‌గన్ అయి ఉండొచ్చని పేర్కొన్నారు. డ్రామా అని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, కడుపునకు అన్నం తినేవాడు ఎవడూ డ్రామా ఆడరని అన్నారు. భద్రతా వైఫల్యం అని చేతులు దులుపుకునే పనిలో పడ్డారని విమర్శించారు.

వివక్షకు వ్యతిరేకంగా పోరాడటమే అంబేద్కర్‌కు నివాళి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు


విజయవాడలోని తుమ్మళపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కుల నిర్మూలన కోసం, వివక్షకు వ్యతిరేకంగా పోరాడటమే డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు మనం ఇచ్చే నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మళపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల నిర్మూలనకు, వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. దేశంలో మనువాదాన్ని పునరుద్ధరించే ప్రయత్నం జరుగుతోందని, దేశ ప్రజలందరూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలను ఉపయోగించుకుని ఈ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రాబోయే కాలంలో మనువాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో సిపిఎం భాగస్వామ్యం అవుతుందన్నారు. రోజురోజుకూ దళితులు, మహిళలు, అణగారిన తరగతులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు (వైవి), డి రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అంద్ర మాల్యాద్రి, జె జయరామ్, పార్టీ సీనియర్ నాయకులు వై కేశవరావుతోపాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన జగన్నాటకం

ఎంపి రఘురామ కృష్ణంరాజు

ప్రజాశక్తి- కాళ్ల (పశ్చిమగోదావరి జిల్లా)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి ఒక నాటకమని నరసాపురం ఎంపి కనుమూరి రఘు రామకృష్ణంరాజు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో ఆదివారం ఆయన ఆయన విలేకరులతో మాట్లాడారు. దాడి జరిగినప్పుడు కరెంటు లేకపోవడం, జగన్‌మోహన్‌రెడ్డికి, వెలంపల్లికి మాత్రమే రాయి తగలడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

ఆ మాటలను వెనక్కి తీసుకుంటున్నా...

ఎంఎల్ఎ రామరాజుకు అనుకూలంగా ఉండిలో దీక్ష చేస్తున్న వారిని బెట్టింగ్ వాళ్లు అని అన్న మాటను తాను వెనక్కి తీసుకుంటున్నానని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఒకవేళ ఎప్పుడైనా మూడు రోజులు దీక్ష చేయాల్సి వస్తే వారి సలహా తప్పకుండా తీసుకుంటానని అన్నారు.

22న నామినేషన్

సోమవారం సాయంత్రానికి పోటీ ఎంపీగానా, ఎంఎల్ఎగానా అనేది స్పష్టత వస్తుందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేస్తానని చెప్పారు.

కేరళ తరహాలో నర్సింగ్ విద్య

- ఆర్థికభారం లేకుండా వైద్యసేవలు
- వైద్యులతో లోకేష్ ముఖాముఖి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కేరళ తరహాలో నర్సింగ్ విద్యను ప్రోత్సహిస్తామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై చైతన్యం తీసుకొస్తామన్నారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో లోకేష్ ఆదివారం జూమ్ ద్వారా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి ఆర్థికభారం పడకుండా, మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలన్నది తమ పార్టీ విధానమని అన్నారు. దశలవారీ యూనివర్సల్ హెల్త్ కేర్ విధానాన్ని అమల్లోకి తెస్తామన్నారు. జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.1400 కోట్ల బకాయిలు పెట్టిందన్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగినందుకు వైద్యుడు సుధాకర్‌ను వేధించి చంపారని విమర్శించారు. ఎయిమ్స్‌లో కనీసం తాగునీటి పైప్‌లైన్ వేయలేని అసమర్థ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య రంగానికి ప్రభుత్వ బడ్జెట్ పెంచాల్సిన అవసరం ఉందని ఐఎంఎ ఎలక్ట్ ప్రెసిడెంట్ నందకిషోర్ అన్నారు.

టిడిపిలోకి పలువురు

పుట్టపర్తి నియోజకవర్గంతోపాటు విజయవాడకు చెందిన పలువురు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపి నేత, రెస్కో మాజీ ఛైర్మన్ శెట్టివారి రాజశేఖర్‌తోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి అభ్యర్థి సింధూర ఆధ్వర్యంలో టిడిపి కండువా కప్పుకున్నారు. విజయవాడకు చెందిన చెన్నుపాటి శ్రీనివాస్, పరమేష్ టిడిపి ఎంపి అభ్యర్థి కేశినేని చిన్ని ఆధ్వర్యాన పార్టీలో చేరారు. ఉండవల్లిలోని తన నివాసంలో లోకేష్ వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్రంలో ఏం జరుగుతోంది?

- కేంద్ర ఎన్నికల సంఘం, హోంశాఖ ఆరా
- ఎన్నికల కమిషన్‌కు వైసిపి, టిడిపి ఫిర్యాదులు


ఎన్నికల సంఘం అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నేతలు, సజ్జల తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుంది? జడ్‌ప్లస్, జడ్, వై కేటగిరి రక్షణలో ఉండే నేతలపై రాళ్లు విసురుతున్న ఘటనలు వరుసగా జరుగుతుంటే పోలీస్, వివిఐపి రక్షణ చూసే విభాగాలు, నిఘా వర్గాలు ఏమి చేస్తున్నాయనే పరిస్థితిపై కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర హోంశాఖ ఆరా తీస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన లోపాలు, అధికారులు వ్యవహరిస్తున్న తీరు, జరుగుతున్న పరిణామాలపై కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం ఏ రోజుకారోజు కేంద్రానికి నివేదికలు అందజేస్తున్నట్లు సమాచారం. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘానికి సిఇఒ నివేదిక అందజేశారు. ఒకట్రెండు రోజుల్లో కీలక నిర్ణయం వెలువరించవచ్చని ఉన్నతాధికారుల్లో చర్చ నడుస్తోంది.

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో రోడ్‌షోలో పాల్గొన్న సందర్భంలో దాడి జరిగి 24 గంటలు కాక మునుపే ఆదివారం గాజువాకలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు రోడ్‌షోలోనూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ తెనాలి రోడ్‌షోలోనూ వెనుకవైపు నుంచి ఆగంతకులు రాళ్లు విసిరారు. జనసేన కార్యకర్తలు ఆగంతకుడిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. నేతలపై వరుస దాడులకు సంబంధించి సిఇఒను ఇసి నివేదిక కోరినట్లు తెలిసింది.

పోలీస్ ఉన్నతాధికారులపై వేటు?

రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ముగ్గురు ఐఎఎస్, ఒక ఐజి, మరో ఐదుగురు ఐపిఎస్ అధికారులపై ఇసి బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో వరుస దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తూ విమర్శలు ఎదుర్కొంటున్న ఐజి ఇంటెలిజెన్స్, విజయవాడ, విశాఖ పోలీస్ కమిషనర్లపై ఇసి వేటు వేసే అవకాశాలున్నాయని ఆ శాఖలో చర్చ నడుస్తోంది.

సిఎం జగన్‌పై దాడి వెనుక కుట్ర కోణం
- ఎన్నికల కమిషన్, డిజిపికి వైసిపి ఫిర్యాదు

సిఎం జగన్‌పై దాడి ఘటన వెనుక కుట్ర కోణం ఉందని కేంద్ర ఎన్నికల సంఘానికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపిలు అయోధ్యరామిరెడ్డి, నందిగామ సురేష్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి రావెళ కిషోర్ కుమార్ ఆదివారం ఫిర్యాదు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదు కాపీని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో అడిషనల్ సిఇఒ హరీంధర్ ప్రసాద్‌కు అందజేశారు. దాడిలో పవర్‌ఫుల్ ఆయుధం వాడారని, షార్ప్ షూటర్‌తో దాడి చేసినట్లుగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విపక్షనేత చంద్రబాబు రెచ్చగొట్టేలా సభల్లో మాట్లాడుతున్నారని, బూతులు తిట్టడం, రెచ్చగొట్టడం వంటి వ్యాఖ్యలు రాజకీయాల్లో చేయకూడదని అన్నారు. సిఎంపై జరిగిన దాడిని కోడికత్తి 2.0 అని, హేళన చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డిజిపికి విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు అందజేశారు.

సిబిఐ, ఎన్ఐఎతో విచారణ జరిపించాలి
టిడిపి మాజీ ఎంపి కనకమేడల రవీంద్రకుమార్

సిఎం జగన్‌పై విజయవాడ రోడ్‌షోలో ఆగంతకుడు రాయితో దాడి చేసిన ఘటనపై సిబిఐ లేక ఎన్ఐఎతో విచారణ జరిపించాలని టిడిపి రాజ్యసభ మాజీ ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిని రక్షించలేని స్థితిలో డిజిపి, డిజి ఇంటెలిజెన్స్, విజయవాడ సిపిలు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఇదే పరిస్థితి కొనసాగితే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే అవకాశం లేదని, వెంటనే వీరిని ఆ బాధ్యతల నుంచి తప్పించి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆయన ఇసికి చేసిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

సిపిఎస్ సమస్యకు ఏడాదిలో శాశ్వత పరిష్కారం

- తెనాలి సభలో పవన్ కళ్యాణ్ హామీ



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదిలోగా సిపిఎస్ సమస్యను పరిష్కరిస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తెనాలి మార్కెట్ సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం ఇసుక దోపిడీ చేసి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొట్టిందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యం దెబ్బ తీసే విధంగా నాసిరకం మద్యం విక్రయించారని ఆరోపించారు. సిఎం జగన్‌కు అధికారం తలకెక్కిందని, అహంకారంతో దోపిడీ, దౌర్జన్యాలకు వైసిపి వారిని ఉసిగొల్పుతున్నారని విమర్శించారు. వైసిపి అరాచకాలపై రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా తాను బాధ్యతగా వ్యవహరిస్తానని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినా తాను అధైర్య పడలేదని, పట్టుదలతో ముందుకెళ్తున్నానని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో వ్యాపార వర్గాలకు అండగా ఉంటామని, ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించే విధంగా పథకాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. రాజధాని అభివద్ధికి కషి చేస్తామని, అమరావతే రాజధానిగా ఉండాలని తమ విధామని స్పష్టం చేశారు. మహిళలపై దాడులను నివారించేందుకు చట్టాలను పటిష్టం చేస్తామని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిపై రాయి దాడి జరిగితే రాష్ట్రం గాయపడినట్టుగా వైసిపి నాయకులు చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి వద్ద ఒక బిసి యువతిని వైసిపి కార్యకర్తలు వేధిస్తే.. దానిపై ప్రశ్నించిన ఆమె తమ్ముడిని చంపారని, దీనిపై సిఎం జగన్ కనీసం స్పందించలేదన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ చెల్లెళ్లు ఇద్దరు రోడ్డెక్కి ఆక్రందిస్తుంటే ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఇలాంటి ఎన్నో ఘటనలు రాష్ట్రాన్ని గాయపరిచాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా సానుభూతి కోసం జగన్ ఏదో ఒక ఘటనను సష్టిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై స్పందించాల్సిన అవసరం లేదని, ఇది కేవలం 'నాన్నా పెద్దపులి' సామెతలాగా మారిందని విమర్శించారు. సభలో టిడిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన తెనాలి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, తదితరులు ప్రసంగించారు.

ప్లే స్కూల్ ఫీజు రూ.4.3 లక్షలు

- బిడ్డ చదువు గురించి తండ్రి ట్వీట్ వైరల్
- కార్పొరేట్ స్కూళ్ల దోపిడీపై ఆందోళన



న్యూఢిల్లీ : కొత్త విద్యా సంవత్సరం వచ్చేస్తోంది. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రుల కుస్తీలూ మొదలయ్యాయి. వీరిని నిలువు దోపిడి చేసేందుకు కార్పొరేట్ విద్యా సంస్థలు సిద్ధమయ్యాయి. గతేడాది కంటే దాదాపు 40 శాతం నుంచి 50 శాతం వరకు అధిక భారం మోపనున్నాయి. ఢిల్లీకి చెందిన ఆకాష్ కుమార్ అనే చార్టర్డ్ అకౌంటెంట్ పోస్టు చేసిన 'ప్లే స్కూలు ఫీజు' గురించి ఇప్పుడు నెట్టింట విస్తృత చర్చ నడుస్తోంది. ఆకాష్ తన తనయుడుని ఢిల్లీలోని ఒక కార్పొరేట్ ప్లే స్కూలులో చేర్పించారు. ఆ స్కూలు ఏకంగా రూ.4.3 లక్షలు ఫీజు వసూలు చేసింది. 'నేను నా జీవితంలో చదివిన మొత్తం చదువుకు ఎంత ఫీజు చెల్లించానో.. అంతకంటే ఎక్కువగా నా బిడ్డ ప్లేస్కూల్ కోసం చెల్లిస్తున్నాను. ఆ స్కూల్లో కనీసం ఆడటం నేర్చుకుంటాడని నేను ఆశిస్తున్నాను' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఫీజు రసీదునూ ఆయన పోస్టు చేశారు. అందులో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి విద్యా సంవత్సరానికి ఫీజుల వివరాలను ఆ రసీదులో పేర్కొన్నారు. ఈ పోస్టు ఇప్పటికే 25 లక్షల మంది పైగా వీక్షించారు. మిగిలిన తల్లిదండ్రులు కూడా ఫీజుల కోసం తాము పడుతున్న కష్టాలను, విద్యావ్యవస్థను కార్పొరేటీకరించడం వల్ల జరుగుతున్న అన్యాయాన్ని, పెరుగుతున్న భారాలను తెలియజేస్తున్నారు. ఢిల్లీలో ఆకాష్ తరహాలోనే గుర్గావ్‌లోని ఒక వ్యక్తి ఇటీవల తన 3వ తరగతి కుమారుడి స్కూల్ ఫీజు నెలకు రూ. 30,000 చెల్లిస్తున్నట్లుగా పోస్టు చేసిన సంగతి తెలిసిందే.

ప్లే స్కూలు బాదుడు ఇలా..

రిజిస్ట్రేషన్ ఫీజు (నాన్-రిఫండబుల్)	- రూ.10వేలు
ఏడాది ఫీజు	- రూ.25వేలు
టర్మ్-1 (ఏప్రిల్ - జూన్ 2024)	- రూ.98,750
టర్మ్-2 (జులై- సెప్టెంబర్ 2024)	- రూ.98,750
టర్మ్-3 (అక్టోబర్ -డిసెంబర్ 2024)	- రూ.98,750
టర్మ్ -4 (జనవరి - మార్చ్ 2025)	- రూ.98,750
టోటల్ ఫీజు	- రూ.4,40,000



పుస్తకావిష్కరణలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, వి.శ్రీనివాసరావు, కె.స్వరూపరాణి, యార్లగడ్డ జోయ, వై.అచ్యుతరావు తదితరులు

ఉద్యమాలకు స్ఫూర్తి యార్లగడ్డ జోయ

- పుస్తకావిష్కరణలో వడ్డే, వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చందర్లపాడు (ఎన్‌టిఆర్ జిల్లా)

బాల్యం నుండే ఉద్యమాల బాట పట్టిన యార్లగడ్డ జోయ భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తారని మాజీ మంత్రి, రాజ్యాంగ హక్కుల వేదిక, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడులో సిపిఎం సీనియర్ నాయకురాలు, ఐద్వా ఉద్యమ నేత యార్లగడ్డ జోయ జీవితంపై ప్రచురించిన 'ఉద్యమాల ఒడిలో యార్లగడ్డ జోయ' పుస్తకాన్ని ఆదివారం వడ్డేతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. జోయ స్వగృహం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కల్యాణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వడ్డే మాట్లాడుతూ.. బాల్యం నుండే కమ్యూనిస్టు ఉద్యమాలవైపు ఆకర్షితురాలైన జోయ అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారని కొనియాడారు. కుటుంబంలో రాజకీయ వైరుధ్యం ఉన్నా కుటుంబ సభ్యులను వామపక్షాల వైపు మళ్లించడంలో ఆమె కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆమె పట్టుదల, నిబద్ధత భవిష్యత్తు ఉద్యమాలకు స్ఫూర్తిగా ఉంటాయన్నారు. వీరులపాడు మండలం దొడ్డదేవరపాడులో బాలికపై అత్యాచారం ఘటనపై పెద్దఎత్తున ఆందోళన చేయడంతో నిందితులైన పెత్తందారులను అరెస్టు చేశారని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటంలో జోయ కీలకపాత్ర పోషించారని తెలిపారు. పోలీసుల ఆంక్షలను కూడా లెక్కచేయకుండా వీరులపాడు మండలంలో 20 ఎకరాల భూమిని పేదలకు దక్కేవరకు పోరాడిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నందిగామ ప్రాంతంలో పార్టీ విస్తరణకు కృషి చేశారని, అనేక సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. పార్టీ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. రాష్ట్రంలోనే సిపిఎం డివిజన్ కార్యదర్శిగా ఎన్నికైన మొట్టమొదటి మహిళ జోయ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి, వై.కేశవరావు, పిన్నమనేని మురళీకృష్ణ, సీనియర్ నాయకులు బిఆర్.తులసీరావు, ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు, సిపిఎం జిల్లా నాయకులు చనుమోలు సైదులు, ప్రజాశక్తి బోర్డు సభ్యులు ఒ.శాంతిశ్రీ, పలువురు ప్రముఖులు, జోయ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాడి కేసు సిబిఐకి అప్పగించాలి

- ఎన్నికల సంఘానికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన రాయి దాడి కేసును సిబిఐకి అప్పగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని టిడిపి కోరింది. రాష్ట్ర అదనపు సిఇఒ హరీంద్ర ప్రసాద్‌ను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు సచివాలయంలో ఆదివారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల మీడియాతో మాట్లాడుతూ.. అధికారాన్ని నిలబెట్టుకోవడంలో భాగంగానే రాయితో హత్యాయత్నం జరిగిందని జగన్ డ్రామా క్రియేట్ చేశారని విమర్శించారు. ఐదేళ్ల క్రితం ఇలాగే కోడికత్తి డ్రామా ఆడారని అన్నారు. తమ పార్టీ కార్యకర్తల్ని ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక పోలీసులతో దర్యాప్తు చేయిస్తే ఈ భాగోతం బయటకు రాదని, కేసు సిబిఐ దర్యాప్తుకు ఇవ్వాలని తమతోపాటు జనసేన, బిజెపి డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘానికీ ఫిర్యాదు చేస్తామన్నారు. ఇంటెలిజెన్స్ డిజి ముందుగానే కళ్లు తెరచి ఉంటే ఇది జరిగేది కాదన్నారు. దాడి సన్నివేశాలకు సంబంధించి తమ ప్రశ్నలకు జవాబిచ్చే ధైర్యం వైసిపి నేతలకు ఉందా? అని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. దాడి సినిమాకు స్క్రీన్ ప్లే, డైరెక్షన్ ఐ ప్యాక్ టీమ్‌దే అని అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు.

టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, వర్ల రామయ్య, నేతలు దేవినేని ఉమామహేశ్వరావు, పి అశోక్ బాబు, తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో కొత్త నాటకం

- జగన్‌పై దాడిని సిబిఐతో దర్యాప్తు చేపట్టాలి : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)


సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొత్త నాటకానికి తెర లేపారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని టిడిపి కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ పర్యటనలో మూడు గంటల పాటు విద్యుత్ లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేసుకోలేదని, రోప్ పార్టీ ఏమైందని ప్రశ్నించారు. పోలీసులు, సిఎం సెక్యూరిటీ ఏం చేస్తున్నారని, దాడి చేసిన వారిని ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నలు గుప్పించారు. జగన్ బస్సు యాత్రకు జనాదరణ లేదన్నారు. దీంతో, ఓటమి తప్పదని తెలిసి వివేకా హత్య, కోడి కత్తి తరహాలో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నాలుగు రోజుల్లో సంచలనాత్మక ఘటన జరుగుతుందని వైసిపి నేత ట్వీట్ చేశారని, అలాగే ప్రణాళిక ప్రకారం ఘటన జరిగిందని తెలిపారు. జగన్‌పై దాడి, కొద్ది సేపటికే వైసిపి నాయకుల ధర్నాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. దాడి ఘటనపై సిబిఐతో దర్యాప్తు చేయించి, డ్రామాకు తెరదించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. జగన్ ఇలాంటి ప్లాన్లు ఎన్ని వేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో టిడిపి 160 స్థానాల్లో గెలుస్తుందని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాల్గొన్నారు.

ఆరు ప్రత్యేక బృందాలు

మొదటిపేజి తరువాయి

టిడిపి మధ్య 'ఎక్స్'(పాత ట్వీటర్) వార్ మొదలైంది. 2019 ఎన్నికల ముందు కోడికత్తి దాడి చేయించుకున్నట్లుగానే ఇప్పుడు గులకరాయి దాడి జరిగిందని టిడిపి నేతలు చెబుతున్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండే స్క్రిప్టు రాశారనీ విమర్శలు గుప్పించారు. రక్షణలో విఫలమైన డిజిపి, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను విధుల్లో నుండి తప్పించాలని కోరారు. వైసిపి నాయకులు కూడా ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం సమర్పిం చారు. చంద్రబాబు బహిరంగ వేదికల్లో రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేశారని, అందువల్లే దాడి జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ పర్యవేక్షణ నేపథ్యంలో ఒకటీ రెండు రోజుల్లో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. డాక్టర్ల సలహా మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఆదివారం నాడు బ్రేక్ ఇచ్చారు. రోజంతా కేసరపల్లిలో విశ్రాంతి తీసుకున్నారు. ఈ ఘటనలో గాయపడ్డ వెలంపల్లిని వైసిపి నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డితోపాటు పలువురు ఆదివారం నాడు పరామర్శించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా ఉండాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్



సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థి, యువజన సంఘాలపై ఉందని, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యాలయాలు కార్యకర్తలను తయారు చేసే విజ్ఞాన కేంద్రాలుగా ఉండాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన ప్రాంగణంలో నిర్మించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయాన్ని సెయింట్ జోసఫ్ విద్యా సంస్థల అధినేత శౌరీల్ రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయాన్ని ఎం.ఎ.గఫూర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.అబ్దుల్లా, వై.నగేష్, అధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో విద్యార్థి, యువజన సంఘాల కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలపై పోరాడినప్పుడే విద్యార్థి సంఘాల నాయకులకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. చదువులోనూ ముందుండాలని, అప్పుడే గౌరవం పెరుగుతుందని అన్నారు. అంబేద్కర్, భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని, నిత్యం అధ్యయనం చేస్తూ పోరాడాలని సూచించారు. రాయలసీమ ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, జిల్లా సమగ్రాభివృద్ధికి విద్యార్థి, యువజన సంఘాలు కృషి చేయాలని కోరారు. మూడోసారి మోడీ అధికారం చేపడితే రాజ్యాంగంలోని పీఠికలో కొన్ని అంశాలను మార్చాలని చూస్తున్నారని, మత రాజ్యాంగంగా మార్చాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ విధానాలపై పోరాడాలని కోరారు. రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య మాట్లాడుతూ.. చదువు, పోరాటానికి సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు. ఉన్నత పదవుల్లో అత్యధికంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల్లో పని చేసిన వాళ్లే ఉన్నారని, వారి ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సెయింట్ జోసఫ్ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శౌరిల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లలకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సిఎఎకు వ్యతిరేకంగా పోరాటం

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణ్ రావు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సిఎఎ (పౌరసత్వ సవరణ యాక్ట్) చట్టం భారత రాజ్యాంగానికి విరుద్ధమని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపై ఉందని ఎమ్మెల్సీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆవాజ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి అంజుమన్ షాదీఖానాలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె భాష అధ్యక్షతన సిఎఎపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మత ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వాలని ఉద్దేశంతో సిఎఎను తీసుకువచ్చిందన్నారు. 2019 సంవత్సరంలో సిఎఎ చట్టం చేయాలని ప్రయత్నించినపుడు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని గుర్తుచేశారు. అయితే ఇటీవల ఎన్నికలకు ముందు సిఎఎ చట్టాన్ని అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దేశ ప్రజల్లో మరింత ఆందోళన నెలకొందని అన్నారు. సిఎఎ వల్ల ముస్లింములకే కాదని, దేశ ప్రజలందరికీ నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కార్పొరేట్ మతోన్మాద బిజెపి పార్టీని, దాని మిత్రులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని కోరారు. సిఎఎను మన రాష్ట్రంలోనే అధికార, ప్రతిపక్ష పార్టీలు బలపరిచాయని, ప్రత్యక్షంగా టిడిపి, పరోక్షంగా వైసిపి పార్టీలు బిజెపికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్తి మాట్లాడుతూ కార్పొరేట్ మతోన్మాద బిజెపి అవలంబిస్తున్న విధానం వల్ల దేశ ప్రజలందరిపై భారాలు పడుతున్నాయని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం బిజెపి మతాన్ని వాడుకుంటోందని అన్నారు. బిజెపిని, దాన్ని పొత్తు పార్టీలు టిడిపి, జనసేనలను, తొత్తు పార్టీ వైసిపిని ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సదస్సులో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వివి జవహర్లాల్, అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ అక్రమ్, ఎంపిజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి యూసుఫ్, ఎస్‌కె మునీర్, ఎస్ సలీం, సైదా సాహెబ్, ఆవాజ్ పట్టణ కమిటీ కన్వీనర్ షేక్ జానీ భాష, ఆవాజ్ నాయకులు పి అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని, దాని మిత్రులను ఓడించండి

- ఇండియా వేదిక అభ్యర్థుల ప్రచారంలో రామకృష్ణ


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం, సిపిఐ అభ్యర్థులు

ప్రజాశక్తి- మంగళగిరి (గుంటూరు జిల్లా)

అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, రానున్న ఎన్నికల్లో బిజెపిని, దాని మిత్రులను ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇండియా వేదిక బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు ప్రచార కార్యక్రమాన్ని రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. మంగళగిరి గౌతమ బుద్ధరోడ్డు, మెయిన్ బజార్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సెక్యులర్ పదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం నాయకులు జెవి రాఘవులు, ఎం బాలాజీ, వివి జవహర్‌లాల్, వై కమలాకర్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు, నాయకులు చిన్ని తిరుపతయ్య, జానుబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె జీవన్ సాగర్, కె రాధిక తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల రైల్వే స్టేషన్ అంబేద్కర్ బొమ్మ వద్ద వేదిక నాయకులు నిరసన..

బిజెపి నుండి దేశాన్ని కాపాడుకుంటాం

- ఇండియా వేదిక నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సోషలిజం వంటి అంశాల్ని కాపాడుకుంటామని ఇండియా వేదిక నాయకులు స్పష్టం చేశారు. కేజ్రీవాల్ అరెస్ట్‌ను బిజెపి విధానాలను నిరసిస్తూ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం చేపట్టారు. ముందుగా బాపట్ల పట్టణం రైల్వేస్టేషన్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సమాజ్ వాది, ఆప్, విసికె పార్టీల నేతలు నివాళులర్పించారు. సమాజ్ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడారు.

కేంద్రంలో మోడీ పాలనలో ప్రజాస్వామ్యానికి అర్థం మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షాలను కట్టడి చేయడానికి బిజెపి ప్రభుత్వం పూనుకుందని, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టిందని, కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష నాయకులకు ఇడి నోటీసులు జారీ చేసి.. ఏ క్షణాన్నైనా అరెస్టు చేస్తామనే పద్ధతుల్లో ఉందని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని గద్దె దించేందుకు మతోన్మాద శక్తులను దూరంగా తరిమికొట్టే దిశగా ఇండియా వేదిక ఏర్పడిందన్నారు. బాపట్ల పార్లమెంటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంటా అంజిబాబు మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చు పెడుతూ దేశంలో మత కల్లోలం సృష్టించే బిజెపి మతోన్మాద శక్తులను ఈ ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జెబి శ్రీధర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనని మతోన్మాద శక్తులను రాబోయే సార్వత్రిక ఎన్నికలలో చిత్తుగా ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకొని దేశాన్ని కాపాడుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి (పశ్చిమగోదావరి జిల్లా)

అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం సమాజంలోని ప్రతి పౌరుని బాధ్యత అని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామం అరుంధతిపేట వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి మనువాదాన్ని తిరిగి తీసుకురావడానికి కుట్రలు చేస్తోందని విమర్శించారు.

దీనిలో భాగంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వారి మిత్రపక్షలతో కలిసి 400 సీట్లు సాధిస్తే ప్రస్తుతం ఉన్న రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగంగా మాట్లాడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని, దేశంలోని లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి ప్రజాతంత్రవాదులు దళిత బహుజనలందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కానేటి బాలరాజు, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండలు, జిల్లెల్ల ప్రశాంతి, తెన్నేటి స్టాలిన్, ఎం ఆంజనేయులు, శ్రీను, కోరం వెంకటేశ్వరరావు, రాజేష్, జయశ్రీ, లక్ష్మి, నాగమణి, ప్రియాంక పాల్గొన్నారు.

బిజెపికి యుపి సవాలే!

- గతంలో గెలిచినన్ని సీట్లు రావు
- ఎస్‌పి, కాంగ్రెస్ పొత్తు ఆప్ మద్దతు
- రైతు ఆందోళనల ప్రభావం





(జె.జగదీష్)

దేశ రాజకీయ చిత్రపటంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకం. దేశంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు ఇక్కడే ఉన్నాయి. దేశంలో కుల, మత రాజకీయాలకు కేంద్ర బిందువుగా యుపి ఉంది. కేంద్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవాలంటే.. ఈ రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకుంటే సరిపోతుందనేది రాజకీయ పార్టీల ఆలోచన. అలాంటి రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరగనున్నాయి. ఇక్కడ 17 లోక్‌సభ స్థానాలను ఎస్‌సిలకు కేటాయించారు. మిగిలిన 63 స్థానాలు జనరల్ కేటగిరికి చెందినవి.

బిజెపిలో చేరిన మూడు చిన్న పార్టీలు


2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఒబిసి ఓటర్ల ప్రభావం ఉన్న రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డి), సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి), జనవాది సోషలిస్ట్ పార్టీ (ప్రస్తుతం పేరు జన్ జన్‌వాది పార్టీ), అప్నా దళ్ (కామెరవాడి), మహన్ దళ్‌లు ఎస్‌పి కూటమిలో ఉన్నాయి. పశ్చిమ జాట్‌లలో ప్రభావం కలిగినజయంత్ చౌదరి సారధ్యంలోని ఆర్‌ఎల్‌డి ఇటీవల బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో చేరింది. ఎస్‌బిఎస్‌పి గతేడాది ఎన్‌డిఎలో చేరింది. దివంగత కుర్మీ నాయకుడు సోనేలాల్ పటేల్ స్థాపించిన అప్నాదళ్‌లో చీలిక సమూహం సంజయ్ చౌహాన్ పార్టీ జన్ జన్‌వాది పార్టీ, పల్లవి పటేల్, కృష్ణ పటేల్ నేతృత్వంలోని అప్నాదళ్ (కె) కూడా ఎస్‌పి కూటమి నుంచి విడిపోయాయి. ఈ రెండు పార్టీలు ప్రస్తుతం బిజెపితో పొత్తులో ఉన్నాయి. మొత్తం 80 లోక్‌సభ స్థానాల్లో బిజెపి 74, అప్నాదళ్ 2, ఆర్‌ఎల్‌డి 2, ఎస్‌బిఎస్‌పి 1, నిషాద్ పార్టీ 1 (బిజెపి గుర్తుపై) స్థానంలో పోటీ చేస్తున్నాయి.

ఒంటరిగానే కొన్ని చిన్న పార్టీలు

అప్నాదళ్ (కె), ఎంఐఎం కలిసి పోటీ చేస్తున్నాయి. అప్నాదళ్ మూడు లోక్‌సభ స్థానాలైన ఫుల్‌పూర్, మీర్జాపూర్, కౌశాంబిలో పోటీ చేయనుంది. జన్ జనవాది పార్టీ 30 లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ ఒంటిరిగా ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తోంది. మహన్ దళ్ అధ్యక్షుడు కేశవ్ దేవ్ మౌర్య, షాక్యులు, సైనీలు, కుష్వాహ్స్, మౌర్యలు వంటి ఒబిసి గ్రూపులలో పార్టీకి పునాది ఉంది. ఎస్‌పి పోటీ చేసే స్థానాల్లో ఆపార్టీకి, కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో బిఎస్‌పికి మద్దతు ఇచ్చేందుకు ఆ పార్టీ నిర్ణయించింది. మరోవైపు బిఎస్‌పి సైతం ఒంటరిగానే పోటీ చేస్తోంది.

ఎస్‌పి, కాంగ్రెస్ మధ్య అవగాహన

ఇండియా ఫోరం పార్టీల మధ్య అవగాహన కుదిరింది. సమాజ్‌వాది పార్టీ 63, కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. కాగా సిపిఐ విడిగా ఐదు స్థానాల్లో పోటీ చేస్తోంది. ప్రస్తుతం 80 లోక్‌సభ స్థానాల్లో బిజెపికి 64 , ,అప్నాదళ్‌కి 2, బిఎస్‌పికి 8, ఎస్‌పికి 2, కాంగ్రెస్ ఒకటి ఉంది. రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి.



కులాల మధ్య చిచ్చుపై బిజెపి

ఉత్తరప్రదేశ్‌లో అన్ని సామాజిక వర్గాలు తమ ప్రభావాన్ని చూపుతాయి. మొత్తం జనాభాలో ఒబిసి 39 శాతం, ఒసి 25 శాతం, ఎస్‌సి 20 శాతం, ముస్లింలు 16 శాతం ఉన్నారు. జాతవ్ దళితవర్గం బిఎస్‌పికే అధిక సంఖ్యలో మొగ్గుచూపుతుంది. జాతవ్‌లు, బ్రాహ్మణులకే మాయావతి ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. దీంతో జాతవేతర దళితులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఎస్‌సిల్లో పది శాతం ఉన్న జాతవ్ యేతర ఖటిక్, వాల్మీకి, సోన్‌కార్, పాసి, కోరి సహా 60 జాతవేతర దళిత కులాలను బిజెపి ప్రోత్సహించింది. అలాగే ఒబిసిల్లో కూడా 30 శాతమున్న యాదవేతరులు మౌర్యలు, నిషాద్, కుర్మీలు, లోధీలను బిజెపి ప్రోత్సహించి లబ్ధి పొందుతోంది. దీంతో ఎస్‌సిల్లో జాతవ్ యేతర, ఒబిసిల్లో యాదవేతర కులాల ఓట్లే లక్ష్యంగా బిజెపి పావుల కదిపి, కులాల మధ్య చిచ్చును రగిల్చింది. దీంతో దాదాపు 40 శాతం ఓట్లున్న కులాల మధ్య చీలక తెచ్చి, ఆయా వర్గాల ఓట్లలో గంపగుత్తుగా ఓట్లు రాబట్టుకొని లబ్ధి పొందింది.

అఖిలేష్ ' పిడిఎ' ఫార్ములా

2022 అసెంబ్లీ, తరువాత పట్టణ సంస్థల ఎన్నికలలో పరాజయాల నుండి కోలుకోవడానికి ప్రయత్నిస్తూ, అఖిలేష్ యాదవ్ పిచ్డా, దళిత్, అల్పసంఖ్యక్ (పిడిఎ...వెనుకబడిన, దళితులు, మైనారిటీలు) కూటమి కొత్త ఫార్ములాను రూపొందించారు. గత ఎన్నికల్లో బిజెపి, దాని మిత్రపక్షాలు ఇప్పటికీ యాదవేతర ఒబిసిలు, జాతవేతర దళితుల ఓట్లలో గణనీయమైన వాటాను పొందాయి. ఈ వర్గాలు బిజెపితో విరక్తి చెందుతున్నారని ఎస్‌పి గ్రహించింది. ఈ వర్గాలలో వ్యవసాయ సమస్యలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి అంశాలు దీని వెనుక ఉన్న ప్రధాన శక్తులుగా పరిగణించారు. తదనుగుణంగా ఈ వర్గాలకు చేరువయ్యేందుకు, నేరుగా పార్టీ వ్యూహం సిద్ధం చేసింది.

బిజెపి మత ఎజెండా

కానిస్టేబుల్, ఆర్‌ఒ/ఎఆర్‌ఒ రిక్రూట్‌మెంట్ పరీక్షలలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువత నిరసన వ్యక్తం చేయడం ప్రస్తుత యుపి ప్రభుత్వం ఆగ్రహాన్ని ఎదుర్కొంటోంది. చెరకు రైతుల సమస్యలు ప్రధానంగా యుపి ఎన్నికల్లో కీలకం కానున్నాయి. ధరలు పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలు కూడా బిజెపికి నష్టం చేయనున్నాయి. అయోధ్య రామమందిర నిర్మాణం అంశంతో మతమే ఏజెండాగా బిజెపి ఎన్నికల ప్రచారం చేస్తోంది.

కమలంపై రాజ్‌పుత్‌లు ఆగ్రహం

దశాబ్దాలుగా బిజెపికి మద్దతిస్తూ వస్తున్న రాజ్‌పుత్‌లు ఈసారి ఆ పార్టీపై కారాలు మిరియాలు నూరుతున్న విచిత్ర పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా యుపి, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో రాజ్‌పుత్‌లు ఏకంగా బిజెపిని వ్యతిరేకిస్తూ బహిరంగ సభలు, సమావేశాలు, కుల పంచాయతీలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ యుపిలోని సహారన్‌పూర్‌లో ఈనెల 7న రాజ్‌పుత్‌లు మహా పంచాయత్ నిర్వహించారు. పశ్చిమ యుపిలో తమ జనాభా దాదాపు 10 శాతం ఉన్నప్పటికీ బిజెపి తమకు కేవలం ఒక్క టిక్కెట్టు (మొరాదాబాద్) కేటాయించి అవమానించిందని సదరు పంచాయత్‌లో పలువురు రాజ్‌పుత్ నేతలు విరుచుకుపడ్డారు. ఘజియాబాద్ నుంచి ఎంపిగా ఉన్న తమ సామాజికవర్గానికి చెందిన జనరల్ (రిటైర్డ్) వికె సింగ్‌ను బిజెపి ఈసారి పక్కనపెట్టి టికెట్‌ను మరొకరికి కేటాయించటంపైనా రాజ్‌పుత్‌లలో తీవ్ర ఆగ్రహం కలిగించింది. పశ్చిమ యుపిలో బిజెపిపై వ్యతిరేకత రాజ్‌పుత్‌లకే పరిమితం కాలేదు. త్యాగి, సైని వంటి ఇతర అగ్రకులాలు కూడా తమకు చాలా తక్కువగా టికెట్లు కేటాయించటంపై ఆగ్రహంతో ఉన్నాయి. అవి కూడా ఇటీవలి కాలంలో మహా పంచాయత్‌లను నిర్వహించి బిజెపి వ్యతిరేక తీర్మానాలు చేశాయి.

నిమ్న కులాల్లో సామాజిక, మతపరమైన విశ్వాసాలతో ముడిపడి ఉండే సాంస్కృతిక, జానపద అంశాల్లో బిజెపి మతత్వాన్ని రంగరించింది. దళిత్-ఒబిసి కులాలకు చెందిన పలు వర్గాలు హిందూ మత సంప్రదాయాలతో సన్నిహితంగా ఉండటంతోపాటు ఆ ఆచా రాల్లో, సంప్రదాయాల్లో పాలుపంచుకుంటాయి. ఆరెస్సెస్, బిజెపిలు ఒక పద్ధతి ప్రకారం వీటిల్లో జోక్యం చేసుకుని మతపరమైన ఘర్షణలను రెచ్చగొట్టేలా వినియోగించుకుంటున్నాయి. గ్రామ దేవతలు, జానపద నాయకులు, గ్రామీణ సంప్రదాయాలు, కళాఖండాలు వగైరాలకు క్రమంగా హిందుత్వ రాజకీయాలలో చొప్పిస్తున్నారు. అంతేకాక గోరక్షణ, రామ మందిరం, హిందూ మహి ళల గౌరవ పరిరక్షణ వంటి సామాజిక పరమైన సున్నిత అంశాలను ముస్లిం వ్యతిరేకతకు బిజెపి వాడుకుం టోంది. కానీ ఈసారి సామాజిక, ఆర్థిక న్యాయానికి సంబం ధించిన ప్రశ్నలకు బిజెపి సరైన జవాబిచ్చే స్థితిలో లేదు. ఓబీసీల్లోని కింది కులాలు, దళితుల్లోని అట్టడుగు కులాలు మానవాభివృద్ధి సూచీల్లో మెరుగుపడిన దాఖలాలు ఎక్కడా లేవు. ఈ కులాలన్నీ ఇప్పటికీ సామాజికంగా వివక్షను, వేధింపులను ఎదుర్కొంటున్నాయి. అత్యంత దారుణమైన పేదరికంలో మగ్గుతు న్నాయి. బిజెపి నినాదం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్', డబుల్ ఇంజిన్ సర్కారు, ఈ అట్టడుగు కులాలను దయనీయమైనస్థితి నుంచి బయట పడేయలేకపోయింది. ఇప్ప టికీ ఆ కులాలు అధికారానికి చాలాదూరంలో ఉన్నాయి.

రంగు పడుద్ది!

- లోక్‌సభ ఎన్నికలకు సిరా సిద్ధం
- కర్ణాటక పిఎస్‌యు తయారీ
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సరఫరా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు చెరగని సిరా సిద్ధంగా ఉంది. మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ (ఎంపివిఎల్) తయారుచేసే ఇంక్‌ను దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సరఫరా చేసింది. కర్ణాటక ప్రభుత్వ సంస్థ ఎంపివిఎల్ 1962 నుండి ఎన్నికల సంఘం కోసం ఈ ఇంక్‌ను తయారు చేస్తోంది. దేశంలో వయల్స్ సరఫరా చేశారు. ఈ ఎన్నికల్లో తక్కువ ఓటర్లు ఉన్న లక్షద్వీప్‌కు అత్యల్పంగా సిరాను సరఫరా చేశారు. 110 వయల్స్ సరఫరా చేశారు.

700 మందికొక బాటిల్

700 మంది ఓటర్ల వేళ్లను ఒక వయల్స్ వాడుతారు. దేశవ్యాప్తంగా 12 లక్షలకు పైగా పోలింగ్ కేంద్రాలున్నాయి. వాటిలో 26.55 లక్షల ఇంక్ వయల్స్ వాడుతున్నారు. మహారాష్ట్ర 2.68 లక్షలు, పశ్చిమ బెంగాల్ 2 లక్షలు, బీహార్ 1.93 లక్షలు, తమిళనాడు 1.75 లక్షలు, తెలంగాణ 1.50 లక్షలు, మధ్యప్రదేశ్ 1.52 లక్షలు, కర్ణాటక 1.32 లక్షలు, రాజస్థాన్ 1.30 లక్షలు, ఆంధ్రప్రదేశ్ 1.16 లక్షలు, గుజరాత్ 1.13 లక్షలు, కేరళ 63 వేలు, పంజాబ్ 55 వేలు,, హర్యానా 42 వేలు, ఢిల్లీ 35 వేలు,, జమ్మూ కాశ్మీర్ 30 వేలు, జార్ఖండ్ 1.30 లక్షలు, మణిపూర్ 75,380 వయల్స్ ను పంపించారు. ఇదిలా ఉండగా ఎంపివిఎల్ సంప్రదాయ సీసాకు ప్రత్యామ్నాయంగా మార్కర్ పెన్నును అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోంది. చెరగని సిరా తయారీలో ఉపయోగించే



అత్యధికంగా 80 లోక్‌సభ నియోజకవర్గాలున్న ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా సిరా సరఫరా చేశారు. ఒకే ఓటరు బహుళ ఓటింగ్‌ను నిరోధించడానికి ఎడమ చేతి చూపుడు వేలుకు ముదురు ఊదా రంగు గుర్తును ఉంచే ఇంక్ రాస్తారు. ఈ సిరాను 25 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

లక్షద్వీప్‌కు అత్యల్పం

2024 సార్వత్రిక ఎన్నికలకు రూ. 55 కోట్ల ఖర్చుతో 26.55 లక్షల (వయల్స్ సంఖ్య) బాటిల్స్ చేశారు. అదే 2019లో రూ. 36 కోట్లతో 25.98 లక్షల బాటిల్స్ సరఫరా చేశారు. ఉత్తరప్రదేశ్ కి 2024లో రూ.15.30 కోట్లతో 3.58 లక్షల వయల్స్, 2019 14.59 కోట్లతో 3.64 లక్షల




ముఖ్యమైన పదార్థమైన సిల్వర్ నైట్రేట్ ధరలో హెచ్చుతగ్గుల కారణంగా గత ఎన్నికల్లోనే సీసా ధర రూ.160 ఉండగా ఇప్పుడు అది కాస్తా రూ.174కి పెరిగింది.

మహిళలకు ఏటా లక్ష : ఆర్‌జెడి మ్యానిఫెస్టో



పాట్నా : రక్షాబంధన్ రోజున పేద మహిళలకు ఏటా లక్ష రూపాయలు ఇస్తామని ఆర్‌జెడి (రాష్ట్రీయ జనతాదళ్) ప్రకటించింది. పరివర్తన్ పత్ర పేరుతో 24 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను తేజస్వీ యాదవ్ విడుదల చేశారు. బీహార్ అభివృద్ధికి రూ.1.6 లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ, అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పాలసీ రద్దు, రైల్వే ప్రైవేటీకరణ తగ్గించి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, రూ.500లకే గ్యాస్ బండ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు వంటి హామీలను జోడించింది.

టార్గెట్ వంద



99వ తడవ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 'ఉపాధి' కూలీ

ఆగ్రా : ఎన్నికల్లో వరుసగా పరాజయాల పాలైనా మళ్లీ 99వ సారి ఓ అభ్యర్థి పోటీ చేస్తున్నాడు. పేరు హన్సూరామ్ (78). ఈయన 1985లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేశాడు. అప్పటి నుంచీ ఓడిపోయినా సరే వందవ సారి ఎన్నికల్లో పోటీ చేస్తానని చెబుతున్నాడు. వందసార్లు పోటీ చేయడమే తన లక్ష్యమని.. ఆ తర్వాత ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయనని చెప్పాడు. ఇంకో విశేషమేమిటంటే ఈ అభ్యర్థి 'గ్రామీణ ఉపాధి'లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తొలుత 1985 ఎన్నికల్లో ఆగ్రా జిల్లాలోని ఖేరాఘర్ నియోజకవర్గం నుండి బిఎస్‌పి అభ్యర్థిపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆగ్రా, ఫతేపూర్ సిక్రి స్థానాల్లో పోటీకి నామినేషన్ దాఖలు చేయనున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'నాకు రాజకీయాలంటే ఆసక్తి.

ఎన్నికల్లో పోటీ చేయడానికి 1984 చివరిలో నా ఉద్యోగాన్ని కూడా వదలిపెట్టాను. ఆ ఎన్నికల్లో నాకు ఖేరాఘర్ సీటుకు టికెట్ కచ్చితంగా ఇస్తానని బిఎస్‌పి హామీ ఇచ్చింది. కానీ ఇవ్వలేదు. పైగా పార్టీ కన్వీనర్ 'నీకు నీ భార్యే ఓటు వేయదు. ఇక టికెట్ ఎందుకు? అని నన్ను అవమానించారు. అందుకే నేను 1985లో బిఎస్‌పి అభ్యర్థిపై ఇండిపెండెంట్‌గా పోటీ చేశాను. మూడో స్థానంలో నిలిచాను. ప్రజల నుంచి ఎలాగైనా ఓట్లు రాబట్టాలనే ఉద్దేశంతోనే వరుస ఎన్నికల్లో పోటీ చేశాను. అప్పటి నుండి గ్రామ ప్రధాన్, రాష్ట్ర అసెంబ్లీ, గ్రామ పంచాయితీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. అలాగే భారత రాష్ట్రపతి పదవికి కూడా నా అభ్యర్థిత్వాన్ని దాఖలు చేశాను. కానీ అది తిరస్కరించబడింది.' అని ఆయన అన్నారు. తాను భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ అనుచరుడినని చెప్పుకున్నారు. 1977 నుండి 1985 వరకు బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బిఎఎంసిఇఎఫ్)తో సంబంధాలు కలిగి ఉన్నానని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి తన భార్య శివా దేవి (70), కుమారులు ఆర్థికంగా మద్దతు ఇస్తున్నారని హన్సూరామ్ అన్నారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తానని, భౌతికంగా సంప్రదించలేని ఓటర్లకు ప్రత్యేకించి తాను చేత్తో రాసిన పోస్టు కార్డులను పంపుతానని చెప్పారు.

అటవీ రాష్ట్రంలో బిజెపికి ఎదురుగాలి!

- రైతుల ఆగ్రహం
- కార్పొరేట్ల దోపిడీని ప్రతిఘటిస్తున్న ఆదివాసీలు
- లక్ష్యం చేసుకొని మరీ ఎన్‌కౌంటర్లు
- ఛత్తీస్‌గఢ్‌లో మూడు దశల్లో పోలింగ్

అటవీరాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య గట్టిపోటీ నెలకొంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్వల్ప ఓట్ల తేడాతో అధికారాన్ని కోల్పోయింది. అఖిల భారత స్థాయిలో ఇండియా ఫోరం ఏర్పడినప్పటికీ కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల వలన ఆ పార్టీకి నష్టం వాటిల్లిందని విశ్లేషకులు అంచనా వేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మోడీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ ముందుకు వెళుతోంది. మొత్తం 11 లోక్‌సభ నియోజకవర్గాలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలివిడత ఏప్రిల్ 11న ఒకస్థానానికి, ఏప్రిల్ 26న 3 స్థానాలకు, మే7న ఏడు స్థానాలకు పోలింగ్ జరగనుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 9, కాంగ్రెస్ రెండు సీట్లను సాధించాయి. ప్రధానంగా రిజర్వుడ్ స్థానాలపై కాంగ్రెస్ దృష్టి సారించింది. 11 లోక్‌సభ స్థానాల్లో ఆరు జనరల్ ఐదు రిజర్వ్‌డ్ స్థానాలున్నాయి. నాలుగు ఎస్టీ, ఒక ఎస్సీ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపునకు అవకాశాలు మెండుగా ఉన్నాయని చెబుతున్నారు.

మావోయిస్టుల ప్రభావం

మావోయిస్టుల ప్రభావమున్న 'బస్తర్' నియోజకవర్గం తొలిదశ పోలింగ్‌కు సిద్ధమౌతోంది. రాష్ట్రంలో మావోయిస్టులు, నక్సలైట్ల ఏరివేత దిశగా పనిచేస్తామని ఇప్పటికే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. 'మావోయిస్టు నిర్మూలన ఆపరేషన్' కింద పోలీసులను, భద్రతా బలగాలను అడవుల్లో మొహరింపజేసి, భారీ కూంబింగ్‌లు నిర్వహించి, కనిపించిన మావోయిస్టులను కాల్చిపడేస్తోంది. ఈ చర్యతో మావోయిస్టులకు, పోలీసుల మధ్య కాల్పులు అధికమయ్యాయి. అటవీ ప్రాంతం అధికంగా కలిగిన బస్తర్ స్థానంలో ఎన్నికలపై మావోయిస్టుల ప్రభావం ఉంటుంది.

ధాన్యం రైతుల ఆగ్రహం

రాష్ట్రంలో వరి రైతుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. కాంగ్రెస్ 'రాజీవ్‌గాంధీ కిసాన్ న్యాయ యోజన' పథకం ద్వారా ధాన్యానికి మద్దతు ధర కంటే రూ.600 బోనస్ ఇచ్చి క్వింటాకు రూ.2600 చెల్లించింది. ప్రస్తుతం కాంగ్రెస్ రూ.3200, బిజెపి రూ.3100 ధర చెల్లిస్తామంటూ హామీలిచ్చాయి. రైతులకు మద్దతు ధరకు మించి బోనస్ ఇచ్చే రాష్ట్రాల్లో ధాన్యం సేకరణకు పరిమితులు విధిస్తామని కేంద్రం హెచ్చరించడంతో బిజెపి ప్రభుత్వం ఈ హామీని పక్కనపడేసింది. ఈసారి అదే హామీని అమలు చేస్తామంటున్న బిజెపి మాటలు ప్రజలు నమ్మేట్లులేరు.



అదానీ దోపిడీపై ఆదివాసీల పోరు

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 54 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ 35 స్థానాలు, జిజిపి ఒక సీటును గెలిచాయి. బిజెపి 46.28 శాతం, కాంగ్రెస్ 42.19 శాతం ఓట్లను సాధించాయి. కొత్త అభ్యర్థులను ఎంచుకోవడం ద్వారా బిజెపి లాభపడింది. సీనియర్ నాయకుల్లో అంతర్గతపోరు, అక్రమాలు కాంగ్రెస్‌ను పీడిస్తున్నాయి. ఇటీవల బిజెపి హయాంలో హస్దియో జిల్లాలో వేల ఎకరాల్లో అడవులు కోతకు గురయ్యాయి. మైనింగ్, అదానీ పవర్ ప్రాజెక్ట్‌ల కోసం 30,000లకు పైగా చెట్లను నరికివేయడంతో దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలు నిరసించారు. అడవుల నరికివేత, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ప్యాసింజర్ రైళ్లు నడపడంలో నిర్లక్ష్యం వంటి మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్‌కు పట్టున్న గిరిజన ఓట్లను హిందుత్వ ఎజెండాతో బిజెపి తమవైపు ఆకర్షించేందుకు నానా గడ్డి కరుస్తోందన్న విమర్శలున్నాయి.

కలం బాణాలు

సానుభూతి కోసమే జగన్ డ్రామా : దేశం నేతలు

ఎలక్షన్ల సమరంలో
హింసాత్మక దాడి
ఖండిస్తామంటూనే
ఏల కత్తికోడి?

విజ్ఞతగల ఓటరులే
ఇత్తరుగా తీర్పు
విద్వేషం కక్కనేల
శాంతిబాట నేర్పు

బిజెపి మేనిఫెస్టో విడుదల

విభజనలే ఎజెండాగ
బిజెపి ప్రణాళిక
ఏకపక్ష రాజనీతి
మోడీజీ ప్రహేళిక

ఒకే కోడు, ఒకే పోలు
చాపచుట్టు ఆశ
వైవిధ్యపు భారతాన
చెల్లేనా ఛాందసా?

రాజధాని లేకనే ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం నెలకొల్పలేదు : కేంద్రం

ఏపి రాజధాని జాడ
కోరిందట కేంద్రం
అమరావతి మాటేదో
చెప్పలేద చంద్రం?

రాష్ట్రానికి మేలుకొరకు
కట్టినట్టి ఎన్డీయే
ఆర్బీఐ అడ్డంకికి
ఆన్సరేది ఇవ్వదాయె!

- తె.ర



కర్నూలులో త్రిముఖ పోటీ

- జిల్లాలో మారనున్న పార్టీల బలాబలాలు
- వైసిపి, టిడిపి, అభ్యర్థుల ఖరారు



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత ఎన్నికలకు, ప్రస్తుత ఎన్నికలకు పోల్చినప్పుడు కర్నూలు జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. కర్నూలు జిల్లా పునర్విజన అనంతరం ఒక పార్లమెంటు, 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. గత ఎన్నికల్లో కర్నూలు ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాలుండేవి. అన్నింటినీ అధికార వైసిపి కైవసం చేసుకుంది. కర్నూలు పార్లమెంటు పరిధిలో ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టిడిపి, జనసేన, బిజెపి కూటమి, వైసిపి అన్ని స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించాయి. కర్నూలు పార్లమెంటు స్థానానికి, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. కర్నూలు పార్లమెంటు బరిలో టిడిపి తరపున బస్తిపాటి నాగరాజు, వైసిపి తరపున బివై రామయ్య పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ తరపున రాంపుల్లయ్య యాదవ్ పేరును ప్రకటించారు.

ఆదోనిలో వైసిపి తరపున ప్రస్తుత ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి బరిలో ఉండగా, టిడిపి కూటమి తరపున బిజెపి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి పోటీలో ఉన్నారు. డాక్టర్ పార్థసారథి గతంలో బిజెపి కర్నూలు ఎంపి అభ్యర్థిగా పోటీ చేశారు. కొంత పరిచయాలు పెరిగాయి. కాని సాయిప్రసాద్‌రెడ్డి మూడుసార్లు ఆదోని ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి తనబలాన్ని నిరూపించుకుంటాననే ధీమాతో ఉన్నారు. ఆలూరులో టిడిపి తరపున వీరభద్రగౌడ్, వైసిపి తరపున బుసినే విరూపాక్షి పోటీపడనున్నారు. వీరభద్రగౌడ్ గతంలో ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. విరూపాక్షి ప్రస్తుతం అలూరు నియోజవర్గ పరిధిలోని చిప్పగిరి జెడ్‌పిటిసిగా, రైల్వే కాంట్రాక్టరుగా ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు.

మంత్రి గుమ్మనూరు జయరామ్ ఇక్కడ సిట్టింగు ఎమ్మెల్యేగా ఉండి వైసిపి మెప్పుపొందలేకపోయారు. పైగా అవినీతి ఆరోపణలున్నాయని పక్కనబెట్టారు. ఎంపికి పోటీచేసేందుకు అవకాశం కల్పించినా నిరాకరించి చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. పత్తికొండలో టిడిపి తరపున కెఇ శ్యామ్‌బాబు, వైసిపి తరపున కంగాటి శ్రీదేవి బరిలో ఉన్నారు. ఇండియా వేదిక తరపున సిపిఐ అభ్యర్థిగా రాయచంద్రయ్య పోటీలో ఉంటారు. ఇక్కడ పోటీ మూడు పార్టీల మధ్య పోటీ నెలకొంది. కెఇ శ్యామ్‌బాబు మాజీ డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి కుమారుడు. పోటీ ఉంటుంది. అధికార వైసిపికి పరిస్థితి అనుకూలించవచ్చని అనుకుంటున్నారు.

మంత్రాలయంలో టిడిపి తరపున రాఘవేంద్రరెడ్డి, వైసిపి తరపున వై బాలనాగిరెడ్డి బరిలో ఉన్నారు. టిడిపిలో ముందు నుంచీ పాలకుర్తి తిక్కారెడ్డి టికెట్ ఆశించారు. టికెట్ రానందుకు అసంతృప్తితో ఉన్నారు. ఎలాగైనా తనకే టికెట్ మారుస్తారని ఆశతో ఉన్నారు. టికెట్ ఇవ్వకుంటే స్వతంత్రంగానైనా పోటీ చేయాలని యోచిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వైసిపి అభ్యర్థి వై బాలనాగిరెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నాలుగోసారి కూడా గెలుస్తాననే ధీమాతో ఉన్నారు. కర్నూలులో టిడిపి తరపున టిజి భరత్, వైసిపి తరపున రిటైర్డు ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ బరిలో ఉన్నారు. ఇండియా వేదిక అభ్యర్థిగా సిపిఎం తరపున డి గౌస్ దేశాయ్ పోటీ చేస్తున్నారు. టిజి భరత్ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఇక్కడ ముస్లిం మైనార్టీలు 40 శాతం ఓట్లున్నాయని, అందుకే ముస్లిం అభ్యర్థిని వైసిపి ప్రకటించింది. అయితే సిట్టింగు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్ ఖాన్ ముస్లిం అయినప్పటికీ ఇంతియాజ్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి వైసిపిలో చేరడంతో అధిష్టానం ఆయనకు టికెట్ కేటాయించింది. తీరా హఫీజ్‌ఖాన్ అసంతృప్తితో వున్నారని వైసిపి అధికారంలోకి వస్తే రాజ్యసభ ఇస్తామని వైఎస్ జగన్ ప్రకటించి సంతృప్తి పరిచారు. వైసిపిలో ఎస్‌వి మోహన్‌తోపాటు అందరూ కలిసి ఇంతియాజ్ గెలుపునకు కృషి చేస్తారని అనుకుంటున్నారు. సిపిఎం గతంలో రెండు సార్లు కర్నూలు నుంచి గెలుపొందింది. బలమైన కేడర్ ఉంది. కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లు కూడా ఉన్నాయి. దీంతో సిపిఎంకు ఇంకొంత బలం పెరగనుంది.

కోడుమూరు (ఎస్‌సి) నియోజకవర్గంలో టిడిపి తరపున బొగ్గుల దస్తగిరి, వైసిపి తరపున డాక్టర్ ఆదిమూలపు సతీష్, కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీ కృష్ణ పేర్లను ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభావం వల్ల గట్టి పోటీ ఉంటుంది. ఆదిమూలపు సతీష్ తొలిసారి ఎన్నికల బరిలోకి వచ్చారు. టిడిపి అభ్యర్థి కూడా తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. ఆయనకు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అనుచరులు సహకరించడం లేదు. టిడిపిలో గ్రూపు తగాదాలున్నాయి.

ఎమ్మిగనూరులో టిడిపి తరపున బివి జయనాగేశ్వర్ రెడ్డి, వైసిపి తరపున బుట్టా రేణుక పోటీకి సిద్ధమయ్యారు. మాజీ మంత్రి బివి మోహన్‌రెడ్డి కుమారుడు డాక్టర్ జయనాగేశ్వర్‌రెడ్డి. బుట్టారేణుక వైసిపి తరపున కర్నూలు ఎంపిగా 2014లో గెలుపొందారు. తరువాత ఆమె టిడిపిలో చేరారు. ఆ తర్వాత తిరిగి వైసిపిలోకి వచ్చారు. ఎమ్మిగనూరులో చేనేత కార్మికవర్గం ఎక్కువగా ఉన్నందున ఆమెకు వైసిపి టికెట్ కేటాయించింది.

మహిళా ఓట్లే కీలకం

- 159 నియోజకవర్గాల్లో పురుషులకంటే వారే ఎక్కువ
- మేనిఫెస్టోల్లో మహిళలను ఆకర్షించే పథకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకంగా వ్యవహరించబోతున్నారు. అటు జనాభా పరంగానూ, ఇటు ఓట్ల పరంగానూ రాష్ట్రంలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. దీంతో పార్టీల భవితవ్యాన్ని, అభ్యర్థుల భవిష్యత్‌ను వీరే నిర్ణయించబోతున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నివేదిక ప్రకారం (2024) రాష్ట్ర జనాభా 5.63 కోట్లు. వారిలో పురుషులు 2.76 కోట్లు ఉండగా.. మహిళలు 2.87 కోట్లు. ఇక ఓటర్ల విషయానికొస్తే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి (మార్చి 16) మొత్తం ఓటర్లు 4,09,37,352, వీరిలో మహిళా ఓటర్లు 2,08,49,730 ఉండగా..



పురుష ఓటర్లు 2,00,84,276. పురుషులకంటే స్త్రీలు దాదాపు ఎనిమిది లక్షలు అధికంగా ఉన్నారు. కొత్త ఓట్ల నమోదుకు ఏప్రిల్ 15వరకు అవకాశం ఉండటంతో వీరి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

16 చోట్లే పురుషులు

రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. వీటిలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, రాజాం, విజయనగరం జిల్లా సాలూరు, విశాఖ జిల్లా గాజువాక, తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం, పి.గన్నవరం, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం, కనిగిరి, నెల్లూరు జిల్లా సర్వేపల్లి, రాయలసీమలోని కొడుమూరు, ఆలూరు, మడకశిర, హిందూపూర్,పెనుకొండ నియోజకవర్గాలు మినహాయించి, మిగిలిన 159 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పైన పేర్కొన్న 16 నియోజకవర్గాల్లోనూ పురుష-మహిళా ఓటర్ల మధ్య గ్యాప్ కేవలం 100 నుంచి అయిదువేల ఓట్ల మధ్యే ఉంది.

మహిళలను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీల పాట్లు

రాష్ట్రంలో మహిళా ఓట్లు అధిక సంఖ్యలో ఉండటం, గెలుపోటములను శాసించే స్థాయిలో ఉండటంతో రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ వారి ఓట్ల కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళల కోసం అందరికంటే ముందుగానే మినీ మేనిఫెస్టోను ప్రకటించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనంతో ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే వారందరికీ సంవత్సరానికి రూ. 15వేలు, మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాల పైబడిన మహిళలకు నెలకు రూ. 1500 నగదు పంపిణీ, తదితర అంశాలను టిడిపి ప్రకటించింది. త్వరలో ప్రకటించనున్న ఉమ్మడి మేనిఫెస్టోలో మరిన్ని పథకాలను మహిళలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రకటించే సూచనలు ఉన్నాయి. ఇక అధికార వైసిపి కూడా మహిళలకు సంబంధించి పెద్ద కసరత్తే చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటి వరకైతే అమ్మఒడి, ఆసరా, చేయూత, తదితర పథకాలను వైసిపి అమలు పరిచింది. మేనిఫెస్టోలో మరిన్ని అంశాలను పొందుపరిచే అవకాశం ఉంది.

కూటమిఎంపి అభ్యర్థి దిగుమతి

- తెలంగాణ నుంచి బాపట్లకు
- చీరాలలో ముగ్గురు అభ్యర్థుల మధ్య ఉత్కంఠ పోరు
- పోటాపోటీ ప్రచారం



ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓట్ల వేట ప్రారంభించారు. బాపట్ల పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో ఎస్‌సిలకు రిజర్వు అయిన సంతనూతలపాడు నియోజకవర్గం జిల్లాల పునర్విభజనలో ప్రకాశం జిల్లాలో చేరింది. వేమూరు నియోజకవర్గం ఎస్‌సిలకు రిజర్వు కాగా, మిగతావన్నీ జనరల్ స్థానాలు. వైసిపి, టిడిపి తమ ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ బాపట్ల ఎంపి అభ్యర్థిని, వేమూరు, అద్దంకి, పర్చూరు అసెంబ్లీల నుంచి పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది.

సురేష్‌పై వ్యతిరేకత

ఎన్నికల్లో వైసిపి తరపున ప్రస్తుత ఎంపి నందిగం సురేష్ తిరిగి పోటీ చేస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్ పోటీ చేస్తున్నారు. కృష్ణప్రసాద్ తెలంగాణలో బిజెపి నేత. ఉమ్మడి ఎపిలో పోలీస్ అధికారిగా పలు జిల్లాల్లో పనిచేశారు. టిడిపి సభ్యత్వం కూడా లేకుండానే బాపట్ల ఎంపి సీటు పొందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర మాజీ సహాయ మంత్రి జెడి శీలం పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి నందిగం సురేష్ టిడిపి అభ్యర్థి శ్రీరాం మాల్యాద్రిపై 16 వేల మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఇద్దరూ ఎస్‌సిలో ఒకే సామాజిక తరగతికి చెందినవారు కాగా కాంగ్రెస్ అభ్యర్థి జెడి శీలం వేరే సామాజిక తరగతికి చెందినవారు. వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. జెడి శీలం గట్టి పోటీ ఇస్తారని చర్చలు నడుస్తున్నాయి. ప్రస్తుత ఎంపి నందిగం సురేష్‌పై, వైసిపిపై ఓటర్లలో అసంతృప్తి ఉంది. ఎంపిగా సురేష్ ఏ ప్రాంతానికీ ఎలాంటి మేలూ చేసిన దాఖలాలు లేవని అంటున్నారు.

గట్టి పోటీ

బాపట్ల అసెంబ్లీ స్థానం నుంచి వైపిపి తరపున ప్రస్తుత ఎమ్మెల్యే కోన రఘుపతి పోటీ చేస్తున్నారు. టిడిపి తరపున వేగేశన నరేంద్రవర్మ మొదటిసారి ఎన్నికల బరిలో నిలిచారు. కోన రఘుపతి 2014, 2019 ఎన్నికల్లో వైసిపి తరపున గెలుపొంది మూడో పర్యాయం ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఇక్కడ వేరే వారికి టికెట్ ఇవ్వాలన్న డిమాండు బాగా వచ్చింది. కానీ కోనకే టికెట్ ఖరారైంది. ఇప్పటికే పలువురు వైసిపి నేతలు, ప్రజా ప్రతినిధులు కోనను వ్యతిరేకిస్తూ టిడిపిలో చేరారు. కోన రఘుపతి 2019లో 15 వేల ఓట్ల మోజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ తరపున బలమైన అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలపాలన్న ధ్యేయంతో షర్మిల కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈసారి బాపట్లలో అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉండే అవకాశం ఉంది. చీరాల అసెంబ్లీ నుంచి వైసిపి తరపున కరణం వెంకటేష్ పోటీ చేస్తున్నారు. వెంకటేష్ ప్రస్తుత చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు. బలరాం 2019 ఎన్నికల్లో టిడిపి తరపున 17 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి తరువాత వైసిపికి మద్దతిచ్చారు. టిడిపి తరపున ఎంఎం కొండయ్య మొదటిసారి పోటీ చేస్తున్నారు. చీరాల వైసిపి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయనున్నారు. చీరాల టిడిపి టికెట్‌ను ఆశించి భంగపడిన చేనేతకు చెందిన సజ్జా హేమలత ఇక్కడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. స్థానిక బిసిలకు అన్ని పార్టీల వారు చీరాల టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ స్థానికంగా ఉంది. చీరాలలో ఈసారి టిడిపి, వైసిపి, కాంగ్రెస్ మధ్య ఉత్కంఠ పోరు జరగనుంది.

పర్చూరులో ఇద్దరు ఇన్‌ఛార్జిలను మార్చిన వైసిపి

పర్చూరు అసెంబ్లీ నుంచి వైసిపి తరపున యడం బాలాజీ పోటీ చేస్తున్నారు. టిడిపి తరపున ప్రస్తుత టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 2014, 2019 ఎన్నికల్లో గెలిచి మూడోసారి పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఏలూరి సాంబశివరావు వైసిపి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై 1,647 ఓట్ల మెజారిటీతో గెలిచారు. పర్చూరు నుంచి ఈసారి ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో వైసిపి అధిష్టానం గత ఎన్నికల నుంచి ఇప్పటి వరకు ముగ్గురు ఇన్‌ఛార్జులను మార్చింది. అద్దంకి అసెంబ్లీ నుంచి వైసిపి తరపున పాణెం హనిమిరెడ్డి మొదటిసారి పోటీ చేస్తున్నారు. టిడిపి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ నాలుగో సారి పోటీ చేస్తున్నారు. 2009లో కాంగ్రెస్ నుంచి, 2014లో వైసిపి, 2019లో టిడిపి నుంచి రవికుమార్ పోటీ చేసి గెలిచారు. అద్దంకిలో వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యకు టికెట్ ఇవ్వలేదు. ఈ కారణంగా కృష్ణచైతన్య, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యతోపాటు పలువురు వైసిపి నేతలు, ప్రజా ప్రతినిధులు టిడిపిలో చేరారు. స్థానికేతరుడు అయిన వైసిపి అభ్యర్థి అద్దంకిలో అసమ్మతివాదులతో ఇబ్బందులు పడుతున్నారు.

వైసిపిలో మార్పులు.. చేర్పులు

రేపల్లె అసెంబ్లీ నుంచి వైసిపి తరపున ఈపూరి గణేష్ పోటీ చేస్తున్నారు. టిడిపి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మూడోసారి పోటీ చేస్తున్నారు. అనగాని 2014, 2019 ఎన్నికల్లో టిడిపి తరపున గెలిచారు. రాజ్యసభ సభ్యులు, రేపల్లె వైసిపి ఇన్‌ఛార్జి అయిన మోపిదేవి వెంకటరమణారావును ఈ నియోజకవర్గం నుంచి తప్పించి గణేష్‌కు టికెట్ ఇచ్చారు. దీంతో మోపిదేవి అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వేమూరు అసెంబ్లీ ఎస్‌సిలకు రిజర్వు అయింది. ఇక్కడ వైసిపి తరపున వరికూటి అశోక్‌బాబు పోటీ చేస్తున్నారు. టిడిపి నుంచి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బరిలో ఉన్నారు.

2019 ఎన్నికల్లో వైసిపి తరపున 9,999 ఓట్ల మెజారిటీతో గెలుపొంది మంత్రి అయిన మేరుగ నాగార్జునకు అక్కడ బాగా వ్యతిరేకత ఉందన్న కారణంగా ఆయన్ను సంతనూతలపాడు నియోజకవర్గానికి మార్చారు. వేమూరు నుంచి మంత్రిగా ఉన్న నాగార్జునను ఇక్కడ నుంచి వేరే అసెంబ్లీకి మార్చడం ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్లయింది. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ వైపిపి ఇన్‌ఛార్జిగా ఉన్న అశోక్‌బాబును వేమూరు అభ్యర్థిగా తెచ్చారు. నియోజకవర్గానికి పూర్తిగా కొత్త అయిన అశోక్‌బాబు అందరినీ కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేస్తూ ఎన్నికల సమరంలో ఎదురీదుతున్నారు.

మాటతప్పనంటూ మంట పెట్టేశాడు

'సైకిల్ రావాలి యాత్ర'లో హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'మాట తప్పనంటూ...మంట పెట్టేశాడు..., మడమ తిప్పనంటూ మెడలు విరిచేశాడు.' అంటూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై సినీ నటుడు, టిడిపి ఎమ్మెల్యే బాలకృష్ణ విమర్శించారు. 'సైకిల్ రావాలి.' యాత్రలో భాగంగా ఆదివారం శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం కల్లూరు జంక్షన్‌లోనూ, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని అనంతపురం నగరంలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి పాలనపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మాట తప్పను..మడమ తిప్పనంటూనే రాష్ట్రానికి మంట పెట్టి..మెడలు విరిచేశాడని విమర్శించారు. నవరత్నాలు అంటూనే నవనాడుల నుంచి రక్తాన్ని పీల్చేస్తున్నాడని అన్నారు. దళితులు, మైనార్టీలపైన ఈ ఐదేళ్లలో దాడులు పెరిగాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా వైసిపి మార్చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పాలనను తీసుకొస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, అనంతపురం పార్లమెంటు అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ, అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గార్లదిన్నె మండలం కల్లూరు జంక్షన్ వద్ద మాట్లాడుతున్న బాలక్రిష్ణ

1983 ఎన్నికలు - తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటు

చదరంగంలో పావుల్లా ముఖ్యమంత్రులను మార్చేస్తూ.. ప్రజల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై.. పుచ్చలపల్లి సుందరయ్య అఖిలపక్ష సమరాన్ని ప్రారంభించి ముందుకు సాగుతున్న కాలమది. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నడివీధుల్లో కాంగ్రెస్ తాకట్టు పెడుతోందని, తెలుగువాడి పౌరుషమేమిటో చూపిస్తామంటూ ప్రఖ్యాత సినీ నటుడు ఎన్.టి.రామారావు 1982లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. పార్టీని స్థాపించిన కొద్ది నెలలకే ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఓ కొత్త రాజకీయ ఒరవడిని సృష్టించారు. 1983లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం సాధించింది. 30 సంవత్సరాలుగా పరిపాలిస్తున్న కాంగ్రెస్‌ను ఓడించి తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరిచారు ఎన్‌టిఆర్. టిడిపి పభుత్వ స్థాపనతో సరికొత్త రాజకీయాలకు రాష్ట్రం వేదికైంది. అంతకుముందు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాకర్షక పథకాలకు ఇందిర, లేదా రాష్ట్ర ముఖ్యమంత్రుల పేర్లు ఉండేవి. ఎన్‌టిఆర్ ఈ విధానాన్ని మార్చి తెలుగు పేర్లతో పథకాలను ప్రవేశపెట్టారు. ఒక భిన్నమైన రాజకీయ వొరవడిని సృష్టించారు.

మొత్తం 294 స్థానాలకుగాను తెలుగుదేశం పార్టీ 202 స్థానాలను గెలిచింది. మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది. కేవలం 60 సీట్లతో కాంగ్రెస్ ప్రతిపక్షంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ 97,77,222 (46.30) ఓట్లు సంపాదించింది. ఆ పార్టీ మిత్రపక్షమైన ఇందిరాగాంధీ కోడలు మేనకా గాంధీ నేతృత్వంలోని సంజయ్ విచారమంచ్ 4 స్థానాల్లో గెలుపొందింది. ఆ పార్టీకి రాష్ట్రంలో ఉనికి లేకపోయినా.. ఇందిరాగాంధీ కుటుంబాన్ని వదిలివచ్చిన కోడలుగా మేనకా గాంధీకి ప్రాధాన్యత ఇచ్చి సంజయ్ విచార్ మంచ్‌ను నాలుగు సీట్లలో తెలుగుదేశం పార్టీ గెలిపించింది. సంజయ్ విచారమంచ్‌ని కాంగ్రెస్‌పై కౌంటర్లు ఇవ్వడానికి టిడిపి ఉపయోగించుకుంది. కాంగ్రెస్ 70,90,907 (38.58) ఓట్లు సాధించింది. సిపిఎం 4,25,109 (2.01 శాతం) ఓట్లు పొంది 5 సీట్లలో విజయం సాధించింది. సిపిఐ 5,88,144 (2.79) ఓట్లు పొంది 4 స్థానాల్లో గెలిచింది.



ఎన్.టి.రామారావు



నాదెండ్ల భాస్కరరావు



ఎం. బాగారెడ్డి



ఎం. ఓంకార్



రజబ్ అలీ

ఆ పార్టీ బలపరిచిన ఒక ఇండిపెండెట్ కూడా గెలుపొందారు. కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడేవరకూ ప్రతిపక్షంలో ఉన్న జనతా పార్టీ 43 స్థానాల్లో పోటీ చేసి ఒకే ఒక స్థానంలో గెలుపొందింది. ఆ పార్టీకి 2,03,478 (0.98శాతం) ఓట్లు వచ్చాయి. మొట్టమొదటిసారిగా బిజెపి 80 సీట్లలో పోటీ చేసి 3 సీట్లు గెలిచింది. ఆ పార్టీకి 5,82,464 (2.76 శాతం) ఓట్లు వచ్చాయి. 17 స్థానాల్లో ఇండిపెండెంట్లు (సంజయ్ విచార్‌మంచ్‌తో కలిపి) విజయం సాధించారు.

ముఖ్యమంత్రిగా ఎన్.టి.రామారావు, ప్రతిపక్ష నేతగా ఎం. బాగారెడ్డి

ముఖ్యమంత్రిగా ఎన్‌టిఆర్ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకే అందించే పథకాన్ని (తెలుగు అన్నపూర్ణ సాక్షాత్కారం) ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష నాయకుడుగా కాంగ్రెస్‌లో సీనియర్‌గా ఉన్న ఎం. బాగారెడ్డిని ఆ పార్టీ ఎన్నుకుంది. సిపిఎం శాసనసభాపక్ష నేతగా ఎం.ఓంకార్, సిపిఐ శాసనసభా పక్ష నేతగా మహమ్మద్ రజబ్ అలీ వ్యవహరించారు. ఎన్‌టిఆర్ కొన్ని పాలనాపరమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.

ఏడాదిన్నరకే తెలుగుదేశం ప్రభుత్వ కూల్చివేత

టిడిపి అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలానికే (1984 ఆగస్టుకు) కాంగ్రెస్ పార్టీ, గవర్నర్ రామ్‌లాల్‌ను అడ్డంపెట్టుకొని టిడిపి ప్రభుత్వాన్ని కూల్చివేసింది. టిడిసి స్థాపకుల్లో ఒకరైన నాదెండ్ల భాస్కరరావు.. ఆ పార్టీ అధినేత ఎన్‌టిఆర్ పట్ల తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. పాలనలో వారిద్దరికీ పొసగని పరిస్థితి ఏర్పడింది. పూర్వాశ్రమంలో కాంగ్రెస్ నాయకుడైన నాదెండ్ల భాస్కరరావు, ఎన్‌టిఆర్ గుండె ఆపరేషన్ కోసం అమెరికా వెళ్లినప్పుడు టిడిపి ఎమ్మెల్యేలను కొందరిని తమవైపు తిప్పుకున్నారు. 'ప్రజాస్వామ్య తెలుగుదేశం పార్టీ'ని ఏర్పాటు చేశారు. సంఖ్యాపరంగా ఎంతమంది టిడిపి ఎమ్మెల్యేలు నాదెండ్ల పక్షం వహించారన్నది స్పష్టత లేకపోయినా కొందరు టిడిపి ఎమ్మెల్యేలు, 60 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంతకాలతో నాదెండ్ల.. గవర్నర్‌ను కలిశారు. శాసనసభలో తనకు మెజారిటీ ఉందని, తనను ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయించాలని గవర్నర్‌ను నాదెండ్ల కోరారు. దీంతో ఆయన ఆఘమేఘాల మీద ఎమ్మెల్యేల సంతకాల జాబితా తనకు సమర్పించిన రోజునే నాదెండ్లతో ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఇది ఒకటి రెండు రోజుల్లోనే జరిగిన వ్యవహారంగా పైకి కనిపిస్తున్నా.. ఇందిరా గాంధీ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పకడ్బందీగా ముందస్తు ప్రణాళికతో జరిగిన పెద్ద ప్రజాస్వామ్య వ్యతిరేక కుట్రగా కాంగ్రెసేతర ప్రతిపక్షాలు వ్యాఖ్యానించాయి. అమెరికా నుంచి తిరిగొచ్చిన ఎన్‌టిఆర్‌తో మంతనాలు జరిపి ప్రతిపక్షాలు గొప్ప ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం నిర్వహించాయి. ఉవ్వెత్తున సాగిన ఆ ఉద్యమంతో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పలుచన అయ్యింది. దీన్ని గుర్తించిన కాంగ్రెస్.. గవర్నర్ రామలాల్‌ను వెనక్కి రప్పించి ఆయన స్థానంలో శంకర్‌దయాళ్ శర్మను గవర్నర్‌గా నియమించి మళ్లీ ఎన్‌టిఆర్‌తో ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో నెల రోజుల ముఖ్యమంత్రిగా నాదెండ్ల భాస్కరరావు నిలిచిపోయారు.

- యు. రామకృష్ణ

1983లో పార్టీల బలాబలాలు (మొత్తం స్థానాలు 294)

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
తెలుగుదేశం ★	290	202	97,77,222	46.30
కాంగ్రెస్	294	60	70,90,907	33.58
సిపిఐ	48	04	5,88,144	2.79
సిపిఐ(ఎం)	28	05	4,25,109	2.01
జనతా పార్టీ	43	01	2,03,478	0.92
ఇండిపెండెంట్లు		17	20,92,247	9.91


★ (సంజయ్ విచార్‌మంచ్ 4 సీట్లతో కలిపి)



చెవిలో ఓ మాట

నా ప్రియమైన పాలికా!
ప్రియాతి ప్రియమైన ఓ నా ఏలికా!
ఎప్పటినుంచో రాయాలని నీకో ప్రేమలేఖ
కన్నీటితో తడిసి నానిన రెక్కలతో
కాగితం చెట్టుపై వాలని పదాల పక్షులు
రోజులకొద్దీ చేసా తపస్సు ఒంటికాలిపై నిలిచి ఏకాగ్రంగా
మనసు మొత్తాన్నీ నిలిపి
కరువు సీమలో పిసినిగొట్టు తెల్ల మబ్బు
అప్పుడొకటీ ఇప్పుడొకటీ చినుకు రాల్చినట్లు
ఇన్నాళ్ళకు విప్పుకున్న కవితా పింఛం!
రెక్కలు నొప్పి పుట్టేలా ఎక్కడెక్కడో ఎగిరి
ముక్కు అంచున కరుచుకు వచ్చి
పిల్ల నోట్లో పెట్టినట్లు
'మనసులో మాట' సాక్షిగా
మాపై ప్రేమే రాగం కురిపించే ప్రేమమూర్తివి
చిన్నపిల్లలు చేతులు విశాలంగా చాచి చెప్పినట్లు
ఆకాశమంత ఇష్టం గదా మేమంటే
అందుకే జీవితాంతం మమ్మల్ని పాలించడానికి
అధికార సింహాసనంపై తగని ఆరాటం
అసలే నిస్వార్ధ పరుడివి
కుటుంబమే లేని ఏకాకివి
అణువణువూ దేశభక్తి
కణకణమూ రామభక్తి
రోజుకోసారైనా జపించే
వికసిత భారత్ మంత్రం
నీ పెదవులపై నుంచి
ఆ అక్షరాలు ప్రాణం పోసుకున్నపుడల్లా
రాత్రుళ్ళు చలిరాగం తీసే నగరాల్లో
ఆకాశం దుప్పటి కప్పుకున్న అనాధలు కంటి రెటీనాపై
గర్భవతి బిల్కిస్ బానో శరీరవనంపై
స్వైరవిహారం చేసి కొవ్వెక్కిన వానర మూకను
పూలదండలతో ఊరేగించిన నిస్సిగ్గు దృశ్యాలు
ఎవరి జోలికీ వెళ్ళక పాఠాలు చెప్పుకునే పంతులయ్యకు
దేశద్రోహం బేడీలు వేసి
కాలు కదపడానికి వీల్లేని అండాసెల్లో కుక్కి
వికలాంగుడైనా చక్రాల కుర్చీ అందించలేని
మహోన్నత హిమాలయ కరుణాంతరంగ చిత్రాలు ..!
ఓనా దేశాధిపతీ! ప్రియ నాయకా!
పగలంతా సూర్యకిరణాల హారాలు ధరించి
పొలం తల్లి దాహం తీర్చడానికి
అర్ధరాత్రి నొక్కిన మీటే మృత్యుమీటై
ప్రాణ పుష్పాలను మాడ్చినపుడు
అన్నం పెట్టిన అన్నదాతలపై
నీటి తుపాకులు పేల్చిన ఘట్టాలు!
వరుస వరుసలుగా...
నాకు తెలీక అడుగుతాను
ఇంతకీ మనది
వికసిత భారతమా!
ముకుళిత భారతమా!
చెవిలో చెప్పవా!

– మందరపు హైమవతి
9441062732



వలస పక్షి

స్టాట్యూ ఆఫ్ లిబర్టీ కింద
వలస పక్షుల సమావేశం!
వలస పక్షులన్నీ ఎప్పుడో పరకాయ ప్రవేశం
నేర్చుకున్నాయి!
జూమ్, టీమ్స్ భాషలలో సంభాషణ జరుపుతుంటాయి.
కొత్త మోహాలకి రెక్కలు మొలుస్తూ ఉంటాయి!

• • •

అక్కడ ఎగరడం నేర్చుకున్నాక
భారతదేశపు తల్లి పక్షి గుర్తుకొస్తుందీ!
అందుకే భారత్‌ని విహంగ వీక్షణం చేస్తూంటుంది
వలస దేశంలో కొన్న కొత్త గృహం గురించి
గర్వంగా ప్రస్తావిస్తుందీ!
వలసల విలాసాల గురించి మరీ మరీ
నెమరు వేస్తుంది!
తల్లి పక్షి గూడు పాడయినా
వలస పక్షి పయనం ఆపదు
ఏ ఆపదకూ అభయం ఇవ్వదు.
పాస్ పోర్ట్, వీసా రెక్కలతో వలస పక్షి
ఎగురుతూ ఉంటుందీ
ఎంత కలిసి పోయినా
కర్ణుడి కుండలాల్లా ఇండియన్ ముద్ర
వదిలిపోదు!
దేశాలన్నీ దగ్గరవుతాయి
దగ్గర వాళ్ళ మధ్య దూరానికి
కాంతి సంవత్సరాల కొలత అవసరమవుతుంది!
వేళ్ళు ఇక్కడే ఉన్న భారత్ దూరమవుతుంది!
ఏం పొగొట్టుకున్నాడో
ఏం రాబట్టుకున్నాడో
తెలియని స్థితిలో
జీవితం సందిగ్ధ సంధ్యవుతుంది!

– వీరేశ్వర రావు మూల
94947 46228

రచనలకు ఆహ్వానం


ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.
అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి – **522501**, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా. prajasavvadi@gmail.com



'మాటలు నిద్రపోతాయి. నిద్రలో కలలు కంటాయి. నిద్రపోతున్న వాళ్లందర్నీ మేలు కొమ్మంటాయి. మేలుకొన్న మాటలు మాత్రమే పాటలు పాడతాయి.
– శ్రీశ్రీ

ఇతిహాసపు చీకటి కోణంపై వెలుగు

"ఒక రాణీ ప్రేమ పురాణం/ ఆ ముట్టడికైన ఖర్చులూ, మతలబులూ, కైఫీయతులూ/ ఇవి కావోయ్ చరిత్రసారం ఇతిహాసపు చీకటి కోణం/ అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు! " అన్నాడు శ్రీశ్రీ.



పరిచయం

అణగారిన కులాల స్త్రీల పోరాటాలపై డాక్టర్ చల్లపల్లి స్వరూప రాణి వెలువరించిన 'మిణుగురులు' ఆ పనిని చేసింది. రచయిత్రి చెప్పినట్లు ఈ పుస్తకంలో చర్చించిన స్త్రీల చరిత్రంతా వారు కులపరంగా, పురుషుల పరంగా, మతపరంగా సామాజిక మూఢ నమ్మకాలు కట్టుబాట్లు సంప్రదాయపరంగా ఎదుర్కొన్న పోరాట దృశ్యాలే. ఇందులో ధిక్కార స్వరం ఉంది. పడి లేచిన కెరటంలా తిరిగి నిలబడిన వారి ఆత్మవిశ్వాసం ఉంది. ఈ పుస్తకంలో 26 మంది జీవిత కథనాలు ఉన్నాయి. ఎంతో సరళంగా హృద్యంగా చక్కని తెలుగు పదాలను పొదిగి కథనం చేశారు స్వరూప రాణి.

చదువుకోవడం ద్వారా తమ జీవితాలను బాగుపడతాయని పూలే, అంబేద్కర్ లాంటి మేధావులు గుర్తించారు. వారి జీవిత సహచరులు కూడా ఆ భావాలను అందిపుచ్చుకున్నారు. అలా సావిత్రిబాయి, పుల్లగూర దీనమ్మ, జ్యోతి లింగమ్మ, ఫాతిమా షేక్ తాము చదువుకోవడమే గాక పాఠశాల స్థాపించి అణగారిన కులాల వారిని విద్యావంతులను చేశారు. సావిత్రిబాయి పూలే పాఠశాలకు టీచర్‌గా వెళ్తున్నప్పుడు ఆమె పైన కోడిగుడ్లు, బురద, రాళ్లు విసిరేవారు. మాటలతోనూ అవమానించేవారు. అయినప్పటికీ ఆమె కుంగిపోకుండా జ్యోతిరావు పూలే ఇచ్చిన ధైర్యంతో సంచిలో మరో చీర పెట్టుకుని వెళ్లి అక్కడ మార్చుకొని మళ్లీ పాఠాలు బోధించేది. ఆమె దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా పేరుగాంచింది. ఆమెకు తోడుగా ఫాతిమా షేక్ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని మహిళా ఉపాధ్యాయునిగా చేరింది. మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయిని అయింది. ఆంధ్రదేశంలో చిలకలూరిపేట దగ్గర పుల్లకూర దీనమ్మ అనే దళితురాలు తాను వికలాంగురాలైనప్పటికీ లూథరిన్ ఎలిమెంటరీ స్కూల్ స్థాపించి, ఆంధ్రాలో మొదటి దళిత ఉపాధ్యాయిని అయింది. మార్కాపురంలో జ్యోతి లింగమ్మ తన భర్త ద్వారా చదవడం రాయడం నేర్చుకుంది. తన భర్త అన్న తిరుపతయ్య దగ్గర్నుంచి ఆయుర్వేద విద్య నేర్చుకుని అన్ని కులాల వారికి వైద్యం అందించింది. అంబేద్కర్ చేస్తున్న కషికి, పోరాటానికి మద్దతుగా రమాబాయి పూర్తిగా అండదండలు ఇచ్చింది. తను ఎన్నో త్యాగాలు చేసి ఆయనకు చదువుకోడానికి డబ్బులు పంపింది.

ఇలా ఈ పుస్తకంలో పరిచయం చేసిన ఇలాంటి 26 మందిలో 11 మంది రాజకీయాల్లో ఉన్నవాళ్లే! ఐదుగురు విద్యారంగంలో పనిచేశారు. నలుగురు సాహిత్య సాంస్కృతిక రంగంలో ఉన్నారు. ఇద్దరు బుద్ధిస్టులు. ఇద్దరు స్వాతంత్ర పోరాట యోధులు. వీరు సమాజంలో కట్టుబాట్లను సంప్రదాయాలను తెంచుకొని నిలబడ్డమే కాకుండా చివరి వరకు పోరాడారు.

ఈ గ్రంథంలో కేరళకు చెందిన ఇద్దరు మహిళల జీవిత కథనాలు ఉన్నాయి. అందులో ఒకరు నంగేలి. ఈమె జాకెట్ వేసుకుంటే రొమ్ములపై పన్నును విధిస్తున్నప్పుడు పాలకవర్గానికి నిరసనగా తన రొమ్ములను కోసి ఇచ్చి ఆత్మ త్యాగం చేసింది. ఇది ఒక ధిక్కార స్వరంగా ఇప్పటికీ ప్రజల నోళ్లలో నాలుతోంది. కొచ్చిన్‌కి చెందిన ద్రాక్షాయిని రాజ్యాంగ సభకు ఎన్నికయింది. ఈమె భర్త వేలాయుధన్. ఇతని మేనల్లుడే భారత రాష్ట్రపతుల్లో రాజనీతిజ్ఞుడుగా పేరుపొందిన కేఆర్ నారాయణన్. ద్రాక్షాయిని అటు గాంధీవాదంలోనూ, ఇటు అంబేద్కర్ వాదంలోనూ తనకు నచ్చని అంశాలను నిర్మామాటంగా చర్చించి, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నారు.

ఆదివాసీల కోసం పోరాడిన వాళ్లలో కత్తి చల్లమ్మ ఒకరు, జండాలమ్మ మరొకరు. నేరస్థ జాబితాలో చేర్చబడిన యానాదుల కోసం కత్తి చల్లమ్మ కషి చేశారు. వారిని ఆ జాబితా నుంచి బయటకు తీయించి, అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. జెండాలమ్మ రాయలసీమ వాసి. శ్రీశైలం దగ్గర ఉన్న గిరిజనుల సంక్షేమ కోసం అనేక పోరాటాలు చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలో సభ్యురాలుగా ఉండి అంబేద్కర్ వాదానికి ఎంతో వన్నెతెచ్చిన ఈశ్వరి బాయి గురించి ఎంతో ఆసక్తికరమైన విషయాలు రచయిత్రి వివరించారు. ఆమె 1967లో ఒకసారి, 1972లో మరొకసారి నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి గెలిచారు. తన కూతురు గీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ తాను మాత్రం ఆ పార్టీలో చేరలేదు. 'నీ జీవితానికి నువ్వే యజమానివి' అన్న బుద్ధుడి మాటలను ఆఖరి శ్వాస దాకా ఆచరించారు. ఈ గ్రంథంలో కమ్యూనిస్టు ఉద్యమంలో రాణించిన కామ్రేడ్ కమల సువార్తమ్మ గురించి వివరించారు రచయిత్రి. కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్న నిబద్ధతను పుణికిపుచ్చుకున్నారు కమల. శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకొని, సంప్రదాయాలను పక్కనపెట్టి ఆదర్శంగా నిలిచారు. అనేక సామాజిక వివాహాలను జరిపారు. ఆడపిల్లలకు సైకిల్ తొక్కడం నేర్పించి వారు చదువుకోడానికి సహాయం అందించారు. బాల సంఘంలో బుర్రకథ నేర్చుకుని, చైతన్యం అందించే కథలను ప్రచారం చేశారు. ఉద్యోగిగా, రచయిత్రిగా తన కుటుంబాన్ని తానే పోషించుకుంటూ ముందుకు సాగిన ధీశాలి నంబూరి పరిపూర్ణ. ఉంటాయి మాకు ఉషస్సులు, కథాపరిపూర్ణం అనే కథాసంపుటి, శిఖరారోహణం వ్యాసాలు కథలు, పొలిమేర నవల రాశారు.

'నా దేశం తప్పు చేస్తే దాన్ని దిద్దుతాను/ నా దేశం ఒప్పు చేస్తే దాన్ని అనుసరిస్తాను' అని గర్వంగా చెప్పిన హేమలత లవణం గురించి కూడా ఈ పుస్తకంలో ఉంది. ఆమె తండ్రి జాషువా, అత్తమామలు సరస్వతి, గోరా అభ్యుదయవాదులు. హేమలత, లవణం దంపతులు ఎంతో మంది అనాథ పిల్లలకు జీవితాన్ని ఇచ్చారు. జోగినిల కోసం చెల్లి నిలయం ఏర్పాటు చేసి జోగినిగా మార్చే దురాచారంపై పోరాటం చేశారు. కులమతాలకు అతీతంగా జీవించారు. హేమలత లాగానే ఇప్పుడు హేతువాద లక్ష్మి కూడా ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నాగార్జున సాగర్‌లో జ్యోతిష్యం కోసం విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని నిర్ణయించినప్పుడు ఆమె పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని నడిపారు. తిరుపతిని వాటికన్ సిటీ తరహాలో హిందూ సిటీగా మార్చాలని కొందరు తలపోసినప్పుడూ ఆమె ఉద్యమించారు. ఇప్పటికీ ఎన్నో సామాజిక ఉద్యమాలు నిర్వహిస్తున్నారు.


బుద్ధిష్టు కల్చరల్ సొసైటీ ఆఫ్ ఇండియా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు మణిసింగ్ గురించి ఈ పుస్తకంలో రాశారు. ఆమె దళిత హక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు కూడా. దళితులపై ఎక్కడ దాడులు జరిగినా ఆమె స్పందించి, పోరాటంలోకి దిగుతారు. ఆమె నివసించే పాలగూడెంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయించారు. అంబేద్కర్ చెప్పిన హేతువాద బాటలో బుద్ధుని చూడాలని, దేవునిగా పూజించకుండా బౌద్ధాన్ని ఆచరిస్తే అది సమాజానికి ఎంతో విలువైనదని ఆమె చెబుతారు. ఒకనాడు జోగినిగా ఉన్న రంగమళ్ళ మహాలక్ష్మి ఇప్పుడు జోగిని నిర్మూలన సంఘానికి చైర్ పర్సన్. ఆశ్రయి అనే స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాల పట్ల ఆకర్షితురాలై తన జోగిని వత్తిని వదిలేసి వారితో పాటు ఇతర జోగిని స్త్రీల విముక్తి కోసం పనిచేస్తున్నారు.

పూలన్ దేవి ఒక సాహస వనిత. పెత్తందారీ ఠాకూర్ల దాష్టీకాలను ఎదిరించటానికి, బందిపోటుగా మారారు. తరువాతి కాలంలో సమాజ్ వాది పార్టీలో చేరి, మీర్జాపూర్ పార్లమెంటు స్థానం నుంచి గెలిచారు. మహిళల కోసం ఏకలవ్య సేన అనే ఒక సంస్థను స్థాపించారు. ఆమెను 2001లో కొందరు దుండగులు కాల్చి చంపేశారు. ఆమె కథ ఈ దేశపు అణగారిన ప్రజల తిరుగుబాటు పతాకగా నిలిచిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ధనసరి అనసూయ అలియాస్ సీతక్క గురించి కూడా ఈ ఈ పుస్తకంలో ఉంది. ఆమె అన్న సాంబయ్య ప్రభావంతో ఆమె జనశక్తి పార్టీ దళ కమాండర్‌గా మారారు. ఉద్యమంలోంచి బయటకు వచ్చాక ఎల్ఎల్‌బి చదివారు. తరువాత రాజకీయాల్లో చేరి, ఇప్పుడు తెలంగాణా మంత్రిగా ఉన్నారు.

ఇలా వివిధ ఉద్యమాల్లో పనిచేసి, ఆదర్శంగా నిలిచిన 26 మంది మహిళల గురించి ఈ పుస్తకంలో వివరించారు. సమాజంలో మార్పు కోసం పనిచేయడమంటే ఏటికి ఎదురీతేనని, అయినా, కారుచీకట్లో మిణుగురు వెలుగుల్లా ముందుకు సాగిపోవడమే తుది విజయాలకు కారణమవుతాయని ఈ మహిళామూర్తుల జీవిత గాథలు మనకు ప్రబోధిస్తాయి.

– పిల్లా కుమారస్వామి
9490122229

అసామాన్యుల స్ఫూర్తిగాథలు



పుస్తకం

స్ఫూర్తి ప్రదాతలు అంటే ప్రపంచానికి అంతా తెలిసిన గొప్ప వ్యక్తులు అనుకోవద్దు. మన నిజ జీవితంలో తారపడే వాళ్లు కూడా ఉంటారు. అలాంటి వారి గురించి ప్రముఖ రచయిత అబ్దుల్ రజా హుస్సేన్ పాఠకులకు ఆకట్టుకునే విధంగా 'స్ఫూర్తి ప్రదాతలు' అనే పుస్తకం రాశారు. ఈ స్ఫూర్తి ప్రదాతల్లో ఆచార్య మన్నవ సత్యనారాయణ ఒకరు. పుట్టుకతోనే చూపులేని ఆయన ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అడవి బాపిరాజు నవలలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. తాను చదివిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోనే ఆచార్య పీఠాన్ని అలంకరించారు. ఆయనను వేలిపట్టుకుని ఆ స్థాయికి చేరుకునేవరకు నడిపించిన, ఆయన తండ్రి వెంకట రామయ్య కూడా స్ఫూర్తిమంతులే! జన్మత: అంధుడైన లక్కోజు సంజీవరాయ శర్మ గణిత శాస్త్రంలో ప్రావీణ్యత పొంది, గణితావధానంలో దిట్టగా నిలిచి, గణిత బ్రహ్మగా కీర్తి పొందారు. అంకెలు ఎలా ఉంటాయో ఆయనకు తెలియదు. అయినా, నాలుగు వేల ఏళ్ల వరకు సరిపోయే క్యాలండర్‌ని సృష్టించారు.

ఢిల్లీ ఐఐటీలో చదివిన అలోక్ సాగర్ అమెరికాలోని ప్రతిష్టాత్మక హూస్టన్ విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పూర్తి చేశారు. తాను చదివిన ఢిల్లీ ఐఐటీలోనే ప్రొఫెసర్‌గా చేశారు. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆయన శిష్యులే. అంతటి మహామనిషి ఇప్పుడు ఓ గిరిజన ప్రాంతంలో తలుపు కూడా లేని ఓ పూరి గుడిసెలో ఉంటూ గిరిజనాభివృద్ధికి పాటుపడుతున్నారు. గిరిజన పిల్లలకు చదువు చెబుతున్నారు. ఓ మూడు జతల దుస్తులు, ఓ టవల్, ఓ పాత సైకిల్ ఆయన ఆస్తి.

తెలుగు సాహిత్యంలో తళుక్కుమన్న మెరుపు తీగె అందే నారాయణ స్వామి. చేనేత కార్మికుడైన ఆయన 33 ఏళ్ల వయసులో కంటిచూపు కోల్పోయారు. ఆయన 1935–1975 మధ్య జీవితాలను కథలుగా రాశారు. ఆయన కథలను అప్పటి ప్రఖ్యాత కథకులు తల్లావఝుల శివశంకర శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి పూనుకొని అచ్చు వేయించారంటే ఆయన ఎంత గొప్ప కథకుడో మనం అర్థం చేసుకోవచ్చు. చింతకింది కనకయ్య 1944లోనే విద్య విలువ తెలుసుకుని తన స్వగ్రామం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఓ విద్యా సంస్థ నెలకొల్పేందుకు అప్పట్లోనే రూ.26 వేలు ఇచ్చారు. ఆయన పేరుతోనే ఆ స్కూల్‌ని ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో చదివిన అనేక మంది ఉన్నత స్థానాలకు ఎదిగారు. తెలుగు మాస్టారు పూసపాటి నాగేశ్వరరావు. పద్య కావ్యాల రచనలో, అవధానాల్లో దిట్ట. జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలు విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణ రెడ్డి చేత ప్రశంసలు పొందారు.

కందుకూరి పైడిరాజుకు కాళ్లు కదలవు, మెడ నిలవదు. చిత్రలేఖనే అతని ఆయుధం. 7వ తరగతి తర్వాత అతనికి కష్టాలు ప్రారంభమయ్యాయి. మొదట కాళ్లు, కీళ్ల నొప్పులు. తర్వాత మెడ నిలవని పరిస్థితి. తండ్రి నింపిన ధైర్యంతో గురువులు, శిక్షణ లేకుండానే చిత్రకారుడిగా ఎదిగారు. స్వప్న అగస్టీన్‌కు రెండు చేతులూ లేవు. అయినా, అధైర్యపడలేదు. కాలి వేళ్లతోనే పెన్సిల్, కుంచె పట్టుకుని చిత్రాలు గీయడం మొదలుపెట్టింది. చిత్రకళా ప్రపంచంలో ఓ స్థానాన్ని సంపాదించుకుంది. కళ కళ కోసం కాదు, సమాజం కోసం అని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు ప్రముఖ చిత్రకారులు దాకోజు శివప్రసాద్. బొమ్మలు ఫ్రీగా గీసివ్వడం ఆయన ప్రత్యేకత. ఎవరికో తెలుసా? అబద్ధం ఆడనంటే ఓ బొమ్మ, మందుకొట్టనంటే ఓ బొమ్మ, పొగతాగనంటే ఓ బొమ్మ గీసిస్తారు. ఉపాధ్యాయుడు కొమెర జాజి ప్రకృతి ఆరాధకుడు. మొక్కలు, పక్షులే అతని ప్రపంచం. వనమూలికా వైద్యం గురించి పుస్తకాలు రాశారు. సంకల్ప బలం ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చని నిరూపించారు నటుడిగా, చేనేత కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించిన పొట్లాబత్తుని లక్ష్మణరావు. చేనేత కార్మికుడి నుంచి మాస్టర్ వీవర్‌గా, మంగళగిరిలో పేరుగాంచిన లక్ష్మీశారీ హౌస్ వ్యవస్థాపకుడిగా ఎదిగారు.

తిమ్మక్కకు 110 సంవత్సరాల వయసు. చదువు లేదు. ఆమె శ్వాస, ధ్యాస, భాష అంతా చెట్లే. పర్యావరణ ప్రేమికురాలిగా 'పద్మశ్రీ' అందుకుంది. పర్యావరణ ఉద్యమ తొలి సేనాని రేచల్ లూయిస్ కార్సన్. పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడిన యోధురాలు. దోమలను సంహరించే డీడీటీ మందు వల్ల పర్యావరణానికి జరిగే హాని, మానవాళికి జరిగే నష్టం గురించి రేచల్ ప్రపంచానికి చాటిచెప్పారు. వాస్తవ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులతో వచ్చిన ఓ సునామీనే తట్టుకున్న నిజమైన మహిళాభ్యుదయవాది గోలి పార్వతీదేవి. భర్త ఇల్లు వదిలివెళ్లిపోతే, జీవితంలో ఆటుపోట్లను ఎదుర్కొంటూ, ఎంఎ పూర్తి చేసి, డీఎస్సీ రాశారు. ప్రభుత్వ టీచర్ ఉద్యోగం పొందారు. ఇద్దరు పిల్లలను ప్రయోజకులను చేశారు.

సంగీత లోకంలో ఓ వేగుచుక్కగా 'ఫిడేలు నాయుడు'గా కీర్తి పొందిన వెంకటస్వామి నాయుడు; మరుగుజ్జు అయినా ఇస్లామిక్ సంస్కృతికి అద్దంపట్టే, ఆకాశాన్ని తాకే ఆలోచనలతో గొప్ప చిత్రాలను గీసిన మహాచిత్రకారుడు కైసర్ అబ్బాస్; 91 ఏళ్ల వయసులోనూ పేదల డాక్టర్‌గా, మదర్ ఆఫ్ ఇండోర్‌గా నిలిచి పద్మశ్రీ అవార్డు అందుకున్న గైనకాలజిస్ట్ డాక్టర్ భక్తియాదవ్; ఇంగ్లీష్ చానల్ ఈది, మెగల్లాన్ సంధిని దాటిన మగధీరుడు, మన తెలుగువాడు మధు నాగరాజు గురించి ఈ పుస్తకంలో రాశారు. ఖద్దరు గాంధీగా పేరుపొందిన కలువకొలను వెంకట్రామయ్య, గోదావరి డెల్టా పితామహుడు సర్ ఆర్థర్ కాటన్ వంటివారి గురించిన వివరాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. అందరూ చదవవలసిన పుస్తకం ఇది.

– శిరందాసు నాగార్జున
94402 22914

మాఘ మాసపు జొన్నపిక్క

శీతకట్టుబెడ్డ దుక్కిల ఎండాకాలపు సెరువుగర్భం లాగ ఇచ్చిపోయి రత్తాపోరైపోయిన పాదాల్ని మెత్తటి మట్టి పెదివిల్తోటి ముద్దెట్టుకుంతే గుండెలోన తేని పొంగి నట్టుండీది! నేలవొంటి మీద జారిన నా సెవట సుక్కలు ఎర్రెర్రని ఆరుద్ర పురుగులై సాలుసాలుకీ పలకరించి మర్నాటికి పలక మీద అచ్చురాల్లాగ పచ్చగ మొలుసుకొచ్చీవి. గింజ మొలకై సినుకమ్మ సిటికి లేని పట్టి నేలపొరల్ని సింపుకోనొత్తాదని ఎరికయ్యింది 'మట్టిఒడి'లోనే!

బతుకంతే బండిగోర్జిలోన ఎడ్లబండి నడక, అరక నేవ సరిజేసుకోవాలని; సంసారమంతే దమ్మమడి దుక్కి, ఎలువు, సలువూ ఎరిగి సాలు బొయ్యాలని; కొటేరేసిన ఏటికర్రంతేనే భూమితల్లికి పెట్టిన సాష్టాంగ దండమని బోధపడింది 'బురదగుడి'లోనే!

• • •

నడకలో నాలుగడుగులు నానే ఎక్కువెయ్యాలని ఏనాడూ పిరియాదు సెయ్యనేదు వలపలెద్దు. సాలు తిరిగినప్పుడల్లా మేడి నొక్కి పడితే బరువంతా నాదేనని పిసరంత బాదకనబర్సనేదు దాపలెద్దు.

"వోరు బొడ్డు తిరిగొచ్చినట్టు కొరడాతోటి కొట్టీ, మునకాల కర్ర ముల్లుతోటి ముడ్డిమీద పొడిసీ, మిమ్మల్నెంత యింస పెట్టేనో" అనంతే... నవ్వీసి.. "పదిమందికి పట్టెడు మెతుకులెట్టడానికే గదా" అని తడితడిగా మాట్లాడి గుండెని తడిపీసీవి ఎడ్లు!

కన్నీరు గుండెకుండలోకి వొంపుకోని, మూగసూపుల్తో కమ్మటి కవుర్లు సెప్పడం తెలిసింది 'బక్కలదడి'లోనే!


గొప్పు తవ్వీ, పారపనిసేసీ, కొడవలి పట్టి పచ్చగడ్డి కోసీ,
ఏతామెక్కి నీళుతోడీ, వొళ్ళు సెవటకాలవై ఏట్లో దిగితే
సముద్రమే కదిలొచ్చి నాగావొళి నదిలోన కలిసినట్టగయ్యాది!

• • •

నేను మన్నును కలగనోడ్ని. మన్ను నన్ను కలగనీది.
ఒకల్లేపోతొకలం లేమని, యిడు జతలై బతకలేమని...!

'నేలబుగ్గి నెత్తికోడమంతే బగమంతుడి పాదం బుర్ర మీద పెట్టుకోడమే' అని బోధపడ్డాది 'మన్నుబడి'లోనే!

గొప్పతనం మడిదో.. మడిలోని మన్నుదో ఏద్దైతేటి అక్కడ అడుగెట్టగానే తివ్వలోకి కరంటు సొరబడినట్టు నా పాదాలే దువ్వారాల్లాగ నా నరాల్లోకి దూరి, సరసరా గుండెలోకి పారి, కండల్లోన యింకి, నాకే తెలీని సత్తువేదో వొళ్ళంతా కమ్మీసీదంతే– అది మట్టీసారమే!



బురదబుక్కి బురదగక్కి మన్నుముద్దను ఎన్నముద్దగా సేసిచ్చే గుణమబ్బింది 'మట్టితల్లి ముద్దుతడి'తోనే ..!

• • •

ఏ సెడుగాలంల అడుగెట్టిందో నా మడిగట్టు మీద 'నాలుగుండల నాగలి బండి'

ఏ దురుమూర్తాన దుష్టపాదం మోపిందో నక్కజిత్తుల 'ఉక్కుటెద్దు',

యాపారానికీ యవసాయానికీ పుట్టిన ఇనపదున్న కూరపాదుల్ని కుమ్మికెలిపోయింది! గుడ్డిముక్కల్ని తన్నికెలిపోయింది!

పాత పుస్తకం సిరిగిపోయింది
తాత సంతకం సెరిగిపోయింది!

నేలదప్పికి తీర్సడాకి నావొళ్ళిప్పుడు 'సెవటసెలమ' కాదు, మెతుకుగింజకు సితిపేర్సిన ఎండాకాలపు ఇసకదిబ్బ..

ములగశిరకార్తిలోని నల్లమబ్బులాటి మనసిప్పుడు కరిగి సినుకై రాలడానికీ సిరాకుపడతంది!

తడి సమ్మంధం తెగిపోయింతరవాత పొడిమాటల పలకరింపుల్తప్ప ఎదురొచ్చి పొదువుకోడాలుండవు!
మన్ను నన్ను మనిసిని సేత్తే నీను మట్టిగుండెని ఇనప దున్నకి వొప్పజెప్పీసేనని ఇప్పుడు బాధపడతన్ను ..!

అన్నీ తెలిసి అగ్గేనంల బడ్డాను. అగ్గిల సేతులెట్టి ఆకులు పట్టుకోవడాకి అవస్త పడతన్ను... బండినేదు బక్కనేదు. నక్కునేదు నాగల్నేదు. తాడూ తలువూ, బుట్టా బొరిగీ ఎటెగిరిపోనాయో తెల్దు.

కళ్ళం నేదు గడ్డికుప్పల్నేవు. గాదీనేదు గాదిల దాన్నిమూ నేవు. కాల్ళల్ల కోడిపిల్లల్లాగ తిరిగిన గుంటల్నేరు. దిసబోడిగున్నాను నా ఆడదాయితోటి..!

తలపాగా సుట్టడమే మరిసిపోయినోడ్ని తువ్వాలు దులిపి రైతునని ఎలగ సెప్పుకోగల్ను!?

నానిప్పుడు – 'సూరీడు నుదుటిమీద సుక్కబొట్టెట్టాలని కలలు గనీ కాటాలో తేలిపోతున్న మాఘమాసపు జొన్నపిక్కని. రైతులేని కాలానికి మడిసెక్కను యేలాడదీస్సి పామాయిలు కొమ్మ మీద రెక్కలు ముడుసుకొని కూకున్న కళింగోర పిట్టని ..!

– లాంగుల్య

ప్రజాశక్తి
www.prajasakti.com

హామీలు ఘనం...ఆచరణ శూన్యం

- అన్నదాతల సమస్యలపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం

- నీటి మూటలైన ఎంఎస్‌పి, ఆదాయం రెట్టింపు వాగ్దానాలు
- పథకాలు, బడ్జెట్లలో భారీ కోతలు
- ప్రాణాలు తీసుకుంటున్న రైతన్నలు



న్యూఢిల్లీ : పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి, దాని భాగస్వామ్య పార్టీల అభ్యర్థులు ప్రచారానికి వస్తుంటే రైతన్నలు వారిని తరిమికొడుతున్నారు. ఆ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రైతుల్లో ఇంత ఆగ్రహం ఎందుకు కలుగుతోంది? వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అణచివేసినందుకు మాత్రమే వారు కోపగించుకోవడం లేదు. లేదా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేసినప్పుడు తమపై దాష్టీకాన్ని ప్రదర్శించినందుకు కూడా వారు మండిపడడం లేదు. మరి వాటికి మించిన కారణాలేమున్నాయి?

దేశంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీఇన్నీ కావు. అన్నదాతలకు ఇచ్చిన హామీలను తమ పదేళ్ల పాలనలో మోడీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. వీటన్నింటినీ ఫైనాన్షియల్ అకౌంటబులిటీ ఇండియా (ఫ్యాన్ ఇండియా) సంస్థ రూపొందించిన 'రైతుల రిపోర్ట్ కార్డు' ఎత్తిచూపింది. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదన మేరకు రైతుల ఉత్పత్తులకు కనీసం ఒకటిన్నర రెట్లు అదనంగా కనీస మద్దతు ధర చెల్లించి వాటిని సేకరిస్తామని 2014లో నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. 2016లో ఆయన మరో హామీ కూడా ఇచ్చారు. 2022 నాటికి రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నమ్మబలికారు. అయితే మోడీ హామీ మేరకు రైతుల ఆదాయం 2022 నాటికి నిజంగా రెట్టింపు అయిందా లేదా అనేది పరిశీలిద్దాం.

పథకాల్లో కోతలు

'2021లో వ్యవసాయ కుటుంబాల పరిస్థితిని అంచనా వేస్తూ ఓ నివేదిక విడుదలైంది. 2018-19లో రైతు కుటుంబాల నెలసరి ఆదాయాన్ని ఈ నివేదిక రూ.10,218గా అంచనా వేసింది. లక్ష్యంగా నిర్దేశించుకున్న నెలసరి ఆదాయం రూ.22,610కి ఇది కనీసం దగ్గరగా కూడా లేదు' అని ఫ్యాన్ ఇండియా రిపోర్ట్ కార్డు తెలిపింది. ప్రభుత్వ పత్రాలు, అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం-ధర మద్దతు (ఎంఐఎస్-పీఎస్ఎస్)పై కేంద్రం మౌనం వహిస్తోందని నివేదిక చెప్పింది. ఎంఎస్‌పీ ఆధారిత సేకరణకు ఈ పథకమే కీలకం అవుతుంది. అయితే గత రెండు సంవత్సరాలుగా ఈ పథకంలో కోత పెడుతున్నారు. బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ పథకానికి 2022-23లో రూ.1,500 కోట్లు కేటాయించగా అది 2023-24, 2024-25లో దారుణంగా రూ.0.01 కోట్లకు తగ్గిపోయింది.

ప్రతి రోజూ 30 ఆత్మహత్యలు

2023-24 ఖరీఫ్ సీజన్‌కు ప్రకటించిన కనీస మద్దతు ధర సహేతుకంగా కానీ, గిట్టుబాటు అయ్యేలా కానీ లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం మాట అటుంచి పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు, సహేతుకంగా లేని ఎంఎస్‌పీ...వెరసి చిన్న, సన్నకారు రైతులను, మధ్య తరగతి రైతులను, కౌలుదారులను రుణాల ఊబిలోకి నెట్టేశాయి. ఇక మోడీ ప్రభుత్వం చేస్తున్న మరో వాదన ఏమిటంటే 2013లో అప్పుల భారంతో అల్లాడుతున్న రైతులు 52%గా ఉండగా 2019 నాటికి 60.2%కి తగ్గిపోయారట. ఇందులో వాస్తవం ఎంతుందో చూద్దాం. 2014 నుండి 2022 వరకూ నరేంద్ర మోడీ పాలనలో దేశంలో 1,00,474 మంది అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడ్డారని ఇటీవల విడుదలైన జాతీయ నేర రికార్డుల బ్యూరో నివేదిక తెలియజేసింది. అంటే ఈ తొమ్మిదేండ్లలో రోజుకు సగటున 30 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

శుష్క వాగ్దానాలు, విఫలమైన పథకాలు, అరకొర కేటాయింపుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ పథకం ప్రకారం అన్నదాతలను నిర్లక్ష్యం చేయడమే ఆత్మహత్యలు పెరగడానికి కారణమని రిపోర్ట్ కార్డ్ స్పష్టం చేసింది. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-24 మధ్యకాలంలో రైతుల ఆత్మహత్యలు 10,281 నుండి 11,290కి పెరిగాయి. ఇది గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాచారమే. ఇక బలవన్మరణానికి పాల్పడుతున్న వ్యవసాయ కార్మికుల సంఖ్య మరింత అధికంగా ఉంటోంది. ఈ సంఖ్య 4,324 నుండి 6,083కి...అంటే 41% పెరిగింది. మహారాష్ట్రలోని విదర్భ, మరట్వాడా ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

ఈ హామీల మాటేమిటి?

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి జవసత్వాలు కల్పిస్తామని కూడా నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. 2022-23 నాటికి వ్యవసాయ ఎగుమతులను వంద బిలియన్ డాలర్లకు పెంచుతామని చెప్పారు. పాడైపోయిన వ్యవసాయ ఉత్పత్తుల కోసం అగ్రి-రైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఆ మాటేమో కానీ గత ఐదేండ్లలో ఆయన అనేక వందేభారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతులకు నెలకు రూ.3,000 పెన్షన్ ఇస్తామని కూడా ఊరించారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ఉపాధి హామీ బడ్జెట్ కుదింపు

వ్యవసాయం, రైతుల సంక్షేమంపై ప్రభుత్వ ఖర్చు, అలాగే బడ్జెట్ కేటాయింపులు నానాటికీ తగ్గిపోతున్నాయి. 2014-15, 2021-22 మధ్యకాలంలో వ్యవసాయ కార్మికులు సహా రైతన్నల వేతనాల వృద్ధి రేటు 1 శాతం కంటే తక్కువగానే ఉంది. ఇక గ్రామీణ ఉపాధి హామీ పథకం విషయానికి వస్తే ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ప్రవేశపెట్టడంతో 57 శాతం మంది కార్మికులపై ప్రభావం పడింది. పైగా ఈ పథకానికి గత కొన్ని సంవత్సరాలుగా కేటాయింపులు తగ్గిపోతున్నాయి. 2014-15 బడ్జెట్‌లో ఈ పథకానికి 1.85 శాతం నిధులు కేటాయించగా 2023-24లో 1.33 శాతం మాత్రమే కేటాయించారు. ఉపాధి పథకానికి ఇంత తక్కువ బడ్జెట్ కేటాయించడం అదే మొదటిసారి. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.60,000 కోట్లు కేటాయించారు. అంతకుముందు సంవత్సరపు జీడీపీలో చూసుకుంటే ఇది 33 శాతం తక్కువ. సవరించిన అంచనాలను రూ.86,000గా చూపారు. అయితే 2024-25 అంచనాలలో ఆ పెరుగుదలను చూపలేదు. వీటన్నింటికీ తోడు ఆదేశాలు పాటించనందుకు పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం రూ.7,000 కోట్లు బకాయి పడింది. ఇందులో రూ.2,800 కోట్ల వేతన బకాయిలు కూడా ఉన్నాయి. పేద కార్మికులను శిక్షించాల్సిన అవసరం ఏమొచ్చింది? వారి వేతనాలు లాక్కోవాల్సిన అగత్యం ఏం ఏర్పడింది?

గ్రామీణ రుణాలు తక్కువే

ఎంతో ప్రాచుర్యం కల్పించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు రూ.14,600 కోట్లు కేటాయించారు. అయితే ఇందులో చాలా భాగం బీమా కంపెనీల జేబుల్లోకే వెళ్లాయి. ఉదాహరణకు 2022-23 రబీ సీజన్‌లో 7.8 లక్షల మంది రైతుల క్లెయిములకు సంబంధించి చెల్లించింది కేవలం రూ.3,878 కోట్లు మాత్రమే. ఇక రైతు రుణాల విషయానికి వస్తే బ్యాంకుల పట్టణ, మెట్రోపాలిటన్ బ్రాంచీల ద్వారా అనేక రుణాలు మంజూరు చేశారు. ఇవి మొత్తం రుణాలలో మూడో వంతు ఉన్నాయి. గ్రామీణ బ్రాంచీల ద్వారా ఇచ్చిన రుణాలు తక్కువే. 2019 ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల వరకూ వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు.

విధానాలు మారాలి

ఓ వైపు వాతావరణ మార్పులు, మరోవైపు వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. ఆర్థిక భారాలు, ఉత్పాదక ఖర్చులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా అన్నదాతలు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకుంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతల మరణ మృదంగాన్ని ఆపేయగలమని రిపోర్ట్ కార్డ్ తెలిపింది. ఏదేమైనా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రైతన్నల ఆగ్రహ జ్వాలలు మిన్నుముట్టే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

పది మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తాజా జాబితా

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ 10 మందితో మరో జాబితాను ఆదివారం రాత్రి విడుదల చేసింది. ఈ జాబితాలో పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, కన్నయ్య కుమార్‌లకు చోటు దక్కింది. ఆదివారం రాత్రి ఎఐసిసి విడుదల చేసిన ఈ అభ్యర్థుల జాబితా ప్రకారం.. కాంగ్రెస్ నాయకుడు, జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్‌ను ఢిల్లీ నార్త్ ఈస్ట్ సీటు నుంచి పోటీ చేస్తున్నారు. ఈ స్థానం నుంచి బిజెపి సీనియర్ నాయకుడు మనోజ్ తివారీ బరిలో ఉన్నారు. అలాగే, చాందినీ చౌక్ నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జేపీ అగర్వాల్, నార్త్ వెస్ట్ ఢిల్లీ నుంచి మాజీ ఎంపీ ఉదిత్‌రాజ్ పోటీ చేయనున్నారు. అలాగే, పంజాబ్‌లో అమృత్ సర్ నుంచి గుర్జీత్ సింగ్ ఔజ్లా పోటీ చేస్తుండగా.. జలంధర్ (ఎస్సీ) నుంచి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, ఫతేగఢ్ సాహిబ్ (ఎస్సీ) నుంచి అమర్ సింగ్, భటిండా నుంచి జీత్ మొహిందర్ సింగ్ సిద్ధూ, సంగ్రూర్ నుంచి ఆల్ ఇండియా కిసాన్ విభాగం చీఫ్ సుఖ్‌పాల్ సింగ్ ఖైరా, పటియాలా నుంచి డా. ధరమ్‌వీర్ గాంధీ, ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ నుంచి ఉజ్వల్ రేవతి రమన్ సింగ్‌ను కాంగ్రెస్ బరిలోకి దించింది. అలాగే ఈ జాబితాతో పాటు ఒడిషా అసెంబ్లీ ఎన్నికలకు 75మంది అభ్యర్థులతోనూ మరో జాబితాను కాంగ్రెస్ ప్రకటించింది.

సందేశ్ ఖలీలో మానవ హక్కుల ఉల్లంఘన

- విచారణలో గుర్తించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్‌లోని సందేశ్ ఖాలీలో జరిగిన అనేక సంఘటనల్లో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సి) తన విచారణలో గుర్తించింది. నేరాలను నివారించడంలో చోటుచేసుకున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. ఈ మేరకు తన నివేదికలో అనేక సిఫార్సులు చేసిన కమిషన్ వాటిలోని ప్రతి ఒక్కదానిపైనా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఎనిమిది వారాల్లోగా తెలియజేయాలని స్పష్టం చేసింది. తమ నివేదికను ఎన్‌హెచ్‌ఆర్‌సీ వెబ్‌సైట్‌లో ఉంచామని, అలాగే పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలకు కూడా పంపినట్లు తెలిపింది. చట్టం, అధికారులపై మళ్లీ సందేశ్‌ఖలీ ప్రజల్లో విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని.. సాక్షులకు రక్షణ, ఫిర్యాదుల పరిష్కారానికి భరోసా అందించాలని కోరింది.

కేజ్రీవాల్ పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో ఇడి తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. తన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ పిటీష్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించనుంది. కాగా, సోమవారం జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సింగ్ ఒక సాధారణ వ్యక్తిలా ములాఖత్ జంగ్లాలో కలిసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

వెనిజులాలో కుట్రకు 22ఏళ్లు !

- అయినా మారని అమెరికా తీరు

కారకస్ : ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ను అధికారం నుండి కూలదోసేందుకు పెట్టుబడిదారీవర్గం జరిపిన కుట్రకు ఈ నెల 11తో 22ఏళు నిండాయి. తమ ఆర్థికాధికారాలను కోల్పోతామన్న భయంతో వ్యాపార, వాణిజ్య వర్గాలు మితవాద మిలటరీ అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేశారు. 1999లో ఎన్నికైన చావెజ్, కార్మికులకు సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన పలు కార్యక్రమాలతో బొలివేరియన్ విప్లవాన్ని ప్రారంభించారు. వెనిజులా ప్రజలను దారిద్ర్యం నుండి బయటపడవేయాలన్నది తన లక్ష్యమని ప్రకటించారు. అక్షరాస్యతను విస్తరించాలని, ప్రజారోగ్యం, విద్య సేవలను మరింత మెరుగుపరచాలని భావించారు. రాజకీయాలను ప్రజాతంత్రీకరించాలనుకున్నారు. జాతీయ సంపదను ప్రజల చేతుల్లో పెట్టాలనుకున్నారు.

21వ శతాబ్దంలో సోషలిజం పేరుతో ఆయన తన ప్రచారాన్ని ప్రారంభించారు. అయితే కుట్రదారులు సాధించిన విజయం నిలవలేదు. వందలు, వేల సంఖ్యలో వెనిజులన్లు బొలివారియన్ విప్లవ ప్రయోజనాలను కాపాడుకునేందుకు వీధుల్లోకి వచ్చారు. తిరిగి చావెజ్‌ను అధికారంలో కూర్చోబెట్టారు. అమెరికా దన్నుతో సైనిక ముఠా పన్నిన కుట్ర కేవలం 48గంటల్లోనే వీగిపోయింది. ఈ కుట్ర సమాచారం అమెరికా అధ్యక్షుడు బుష్‌కు ముందే తెలుసునని వివరాలు బయటకు వచ్చాయి. చావెజ్ 2013లోనే మరణించినా వెనిజులాలో బొలివేరియన్ విప్లవాన్ని కూలదోసే ప్రయత్నాలను అమెరికా సామ్రాజ్యవాదం విరమించలేదు. ప్రస్తుత మదురో ప్రభుత్వం అమెరికా కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ముందుకు సాగుతోంది.



2002లో సైనిక తిరుగుబాటు యత్నాన్ని వమ్ము చేసిన అనంతరం కారకస్‌లో తన మద్దతు దారులతో ర్యాలీలో పాల్గొన్న అధ్యక్షుడు హ్యూగో చావెజ్.

మాల్దీవుల నుంచి భారత సైన్యం రెండో బృందం రాక

మాలె: మాల్దీవుల నుంచి భారత్ సైనికులు వెనక్కి వచ్చే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో రెండో విడతగా మన బలగాలు వెనక్కి వచ్చాయి. వీరిలో భారత్ బహుమతిగా ఇచ్చిన హెలికాప్టర్‌లో విధులు నిర్వహిస్తున్న సైనిక సిబ్బంది ఉన్నట్లు మాల్దీవులు అధికారులు తెలిపారు. 'ఇప్పటికే మొదటి బృందం భారత్‌కు వెళ్లిపోయింది. ఈ నెల 9న రెండో విడతలో మరో సైనికుల బృందం స్వదేశానికి వెళ్లింది. ఇక ఇక్కడ ఒక బృందం మాత్రమే ఉంది. ఇరు దేశాలు గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ బృందం కూడా మే 10లోపు వెళ్లిపోతుంది' అని తెలిపారు. అయితే, రెండో బ్యాచ్‌లో ఎంత మంది భారత సైనికులు వెళ్లిపోయారో వెల్లడించలేదు. మొదటి విడతలో భాగంగా అడ్డూ నగరం నుంచి 25 మంది సైనికులు భారత్‌కు తిరిగి వెళ్లిన విషయం తెలిసిందే.

రాజ్యాంగాన్ని రద్దు చేసే ఉద్దేశంతో బిజెపి

- స్టాలిన్

చెన్నై : అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రద్దు చేసే భయంకరమైన ఉద్దేశంతో బిజెపి ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా స్టాలిన్ ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. బిజెపి తన తిరోగమవాదంతో దేశాన్ని తీవ్రమైన ఆకలి వైపునకు, రెండు శతాబ్దాల వెనక్కి తీసుకుని వెళ్లిందని ఈ పోస్టులో ఆరోపించారు. భారతదేశం తన చరిత్రలోనే అత్యంత కీలకమైన ఎన్నికలను ఎదుర్కొంటుందని అన్నారు. అంబేద్కర్‌ను నవయుగ బుద్ధుడుగా అభివర్ణించారు. నిజమైన సమసమాజాన్ని సాధించడానికి అంబేద్కర్ అంతులేని జ్ఞానం, స్ఫూరిని మనం అనుసరించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

ఎంఎస్‌పి ఊసెత్తని బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నంత మేరకు తగ్గిస్తామని తెలిపింది. 2036లో ఒలింపిక్స్ దేశంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని పేర్కొంది. "ఉచిత రేషన్‌ను వచ్చే ఐదేళ్లు కూడా అందిస్తాం. 70 ఏళ్లు పైబడిన వృద్ధులనూ ఆయుష్మన్ భారత్‌లో చేరుస్తాం. రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తాం. పేదలకు మూడు కోట్ల ఇళ్లు కట్టించి ఇస్తాం. దివ్యాంగుల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం చేపడతాం. సీనియర్ సిటిజెన్లతో పాటు ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేస్తాం. భవిష్యత్తులో పైపులైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందిస్తాం. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా లబ్ధిదారులు తమ ఇంట్లో తయారైన కరెంటును అమ్ముకోవచ్చు. ముద్ర పథకం కింద ఇచ్చే రుణాన్ని రూ.20 లక్షలు చేస్తాం. చిరు వ్యాపారులకు వడ్డీల బాధ తొలగిస్తాం" అని పేర్కొన్నారు.

"వచ్చే ఐదేళ్లలో 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేస్తాం. డెయిరీ సహకార సంఘాల సంఖ్య పెద్ద సంఖ్యలో పెంపు. కూరగాయల సాగు, వాటి నిల్వ కోసం కొత్త క్లస్టర్లు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం. వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతాం. భారత్‌ను గ్లోబల్ న్యూటిషన్ హబ్‌గా మారుస్తాం. శ్రీ అన్న రకం పండించడం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. సముద్ర నాచు, ముత్యాల సాగు దిశగా మత్స్యకారులను ప్రోత్సహిస్తాం. భారత్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ వల్ల గ్రామాల ఆదాయం పెరుగుతుంది. నానో యూరియా వినియోగం మరింత పెంచుతాం" అని అన్నారు.

"భారత్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుస్తాం. ఏజెన్సీల్లో పర్యాటకం ప్రోత్సహించి గిరిజనులకు మేలు చేస్తాం. 'సోషల్, డిజిటల్, ఫిజికల్ రంగాల్లో మౌలిక వసతులు పెంచుతాం. దేశంలో అనేక చోట్ల శాటిలైట్ పట్టణాలు నిర్మిస్తున్నాం. విమానయాన రంగాన్ని ప్రోత్సహించి లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాం. త్వరలో వందే భారత్ స్లీపర్, వందే భారత్ మెట్రో రైళ్లు అందుబాటులోకి వస్తాయి. దేశం నలుమూలల బుల్లెట్ రైళ్లు తెస్తాం. దక్షిణ, ఉత్తర, తూర్పు వైపు కూడా బుల్లెట్ రైలు మార్గాలు వేస్తాం. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తాం" అని అన్నారు.

సంకల్ప్ పత్రలోని 14 అంశాలు..

1. విశ్వబంధు, 2. సురక్షిత భారత్, 3.సమృద్ధ భారత్, 4. గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్, 5. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, 6. ఈజ్ ఆఫ్ లివింగ్, 7 సాంస్కృతిక వికాసం, 8.గుడ్ గవర్నెన్స్, 9.స్వస్థ భారత్, 10. అత్యుత్తమ శిక్షణ, 11. క్రీడా వికాసం, 12. సంతులిత అభివృద్ధి, 13. సాంకేతిక వికాసం., 14. సుస్థిర భారత్.

కాన్సులేట్‌పై దాడికి ఇరాన్ ప్రతీకారం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన అన్నారు. ఈ దాడిపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఎక్స్‌లో (పూర్వ ట్విట్టర్‌లో) స్పందిస్తూ ఇరాన్ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టామని అన్నారు. ఇరాన్ చర్యకు ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ దాడి చేసిన పక్షంలో దానికి తన మద్దతు ఉండబోదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నెతన్యాహుకు స్పష్టంగా తెలియజేసినట్లు పేరు తెలపడానికి ఇష్టపడని వైట్ హౌస్ అధికారి ఒకరు అదివారం తెలిపారు. దెబ్బకు దెబ్బ అనే రీతిలో వ్యవహరిస్తే, అది ప్రాంతీయ యుద్ధానికి దారితీసే ప్రమాదముందని, దాని పర్యవసానాలు చాలా భయంకరంగా ఉండే అవకాశముందని అమెరికా ఆందోళన చెందుతున్నది. దీనికి సమన్వయంతో దౌత్యపరమైన గట్టి రియాక్షన్ ఇద్దామని బైడెన్ నెతన్యాహుతో అన్నట్లు వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం దీనిపై జి-7 అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బైడెన్ తెలిపారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపి ఇరాన్ చర్యను ఖండించాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేసింది.

సిరియాలోని ఇరాన్ కాన్సులేట్‌పై కార్యాలయంపై ఇజ్రాయిల్ దాడిని ఖండించడానికి ఇష్టపడని అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇతర జి7 దేశాలు ఇరాన్ ప్రతీకార దాడిని మాత్రం వెంటనే ఖండించాయి. చైనా, రష్యా ఆచితూచి స్పందించాయి. ఇరు పక్షాలు సంయమనం పాటించాలని చైనా కోరింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ ఇరాన్ దాడిని ఖండించారు. మరో యుద్ధాన్ని భరించగలిగే స్థితిలో ప్రపంచం ఇప్పుడు లేదని, ఘర్షణలకు వెంటనే స్వస్తి పలకాలని ఆయన కోరారు.

ప్రశ్నార్థకంగా మారిన భారతీయుల భద్రత?

ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఘర్షణ మరింత విస్తరించిన పక్షంలో అది ప్రాంతీయ యుద్ధానికి దారి తీసే ప్రమాదముండడంతో ఇజ్రాయిల్‌లోని భారతీయుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ఇజ్రాయిలీ సరుకుల రవాణా నౌకను హర్మూజ్ జలసంధిలో స్వాధీనం చేసుకున్న ఘటనలో 17 మంది భారతీయులు బందీలుగా ఉన్నారు. వారి విడుదలకు భారత విదేశాంగ శాఖ దౌత్య పరమైన మార్గాల గుండా చేస్తున్న యత్నాలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. తాజా పరిణామం తరువాత పెరుగుతున్న యుద్ధ భయం నేపథ్యంలో ఇజ్రాయిల్‌లో భారతీయుల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇజ్రాయిల్ రాయబార కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని విదేశాంగ శాఖ సూచించింది.

అంబేద్కర్‌కు రాష్ట్రపతి, ప్రధాని నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నివాళి అర్పించారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ కూడా పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. అలాగే సుప్రీంకోర్టు ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) నిర్వహించింది.

ఏపి భవన్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి

ఆంధ్రప్రదేశ్ భవన్ లో అంబేద్కర్ జంయతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. భారతరత్న బాబాసాహెబ్ భీంరావ్ అంబేద్కర్ 133వ జయంతిని ఏపి భవన్ లో రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఏపి భవన్ సిబ్బంది, అతిథులు, పోలీసు బెటాలియన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన గావించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్న వర్గాలకు ఎనలేని సేవలను చేసి, వారిలో చైతన్యం తీసుకువచ్చిన నాయకుడు అంబేద్కర్ అని అన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో బాబాసాహెబ్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అంబేద్కర్ ప్రవచించిన భావాలను అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న మోడీ
- సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-చెన్నై బ్యూరో

భారతదేశానికి మూల స్తంభాలైన లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమాధికారం, ఫెడరలిజం, సామాజిక న్యాయం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. దేశ ప్రజలు తమ సమస్యలను లేవనెత్తుతున్నప్పుడు ప్రధాని మోడీ సమాధానం చెప్పడం లేదన్నారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడు రాష్ట్రం మదురైలో సిపిఎం ఎంపి అభ్యర్థి వెంకటేషన్ గెలిపించాలని ప్రచారం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. ప్రజలకు వివిధ పథకాలను అమలు చేస్తామన్న నరేంద్ర మోడీ.. పండుగ సీజన్‌లో ప్రజలు మాంసాహారం తింటున్నారనే అంశాన్ని లేవనెత్తుతున్నారన్నారు. 79 శాతం మంది భారతీయులు మాంసాహారం తింటున్నారని చెప్పుతున్నారని, ఇదే.. మోడీకి ప్రధాన సమస్యగా ఉందా? అని ఏచూరి ప్రశ్నించారు. ప్రజలను పోలరైజ్ చేయడం, శాఖాహారం, మాంసాహారం, హిందువులను, హిందువేతరులను విడకొట్టడం మోడీ కుట్రలో భాగమన్నారు. ఈ దేశ మూల స్తంభాలైన లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమాధికారం, ఫెడరలిజం, సామాజిక న్యాయం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ కారణంగానే లౌకిక ప్రజాస్వామ్యంలో భారతదేశం అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటోందని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో లవ్ జిహాద్, గో సంరక్షణ తదితరాల పేరుతో మత ధృవీకరణకు పదును పెట్టే లక్ష్యంతో కొత్త చట్టాలను రూపొందించారని చెప్పారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన క్రూరమైన చట్టాల వల్ల ప్రజాస్వామ్యం ధ్వంసమవుతోందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులు, పౌర స్వేచ్ఛను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. దేశ సంపదను పూర్తిగా దోచుకుని, సహజ వనరులను లూటీ చేశారని తెలిపారు. కార్పొరేట్ల రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం రైతుల రుణాలను ఎందుకు మాఫీ చేయలేదని ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ల అంశాన్ని ఉటంకిస్తూ.. రాజకీయ అవినీతిని వివిధ మార్గాల ద్వారా చట్టబద్ధం చేశారని ఏచూరి విమర్శించారు. ఈ అంశంపై విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి కోరుకున్నది ఫెడరలిజం, వైవిధ్యం కాదని, ఏకీకృత ప్రభుత్వమే అని విమర్శించారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను బిజెపి నాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. భారత్‌ను ఫాసిస్టు హిందుత్వ రాజ్యాంగా మార్చాలని కోరుకుంటోందని తెలిపారు. ఈ దేశంలో మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించినప్పటికీ మోడీ పెడచెవిన పెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రయివేటీకరణ పేరుతో ఆదివాసీలను అటవీ భూముల నుంచి గెంటేశారని, దళితులపై అఘాయిత్యాల పెరుగుతున్నాయని, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఎంపిలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారని తెలిపారు. నిరుద్యోగం రేటు ఇప్పుడు గరిష్ట స్థాయికి చేరుకుందని తెలిపారు.

కవితతో కెటిఆర్ భేటీ

- నేడు కవితను కోర్టు ప్రవేశపెట్టనున్న సిబిఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సిబిఐ కస్టడీలో ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఆమె సోదరుడు కెటీఆర్ ఆదివారం కలిశారు. ఢిల్లీలోని సిబిఐ ప్రధాన కార్యాలయంలో కవిత భర్త అనిల్, న్యాయవాది మోహిత్ రావులతో కలిసి కెటిఆర్ కవితను సాయంత్రం ఆరు గంటలకు కలిశారు. దాదాపు 40 నిమిషాలకు పైగా కవితతో మాట్లాడారు. విచారణలో సిబిఐ అడుగుతోన్న ప్రశ్నలపై ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లో మనోధైర్యం వీడొద్దని, తాము తోడుగా ఉంటామని ధైర్యం చెప్పారు. సోమవారం కవితను ట్రయల్ కోర్టు ముందు హాజరుపరిచే నేపథ్యంలో కోర్టు దృష్టికి తెచ్చే అంశాలపై చర్చించారు. అనంతరం భర్త అనిల్ తో కవిత కాసేపు మాట్లాడారు. కాగా, కవితను ఆదివారం సిబిఐ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు దఫాలుగా ఆమె స్టేట్మెంట్ ను రికార్డు చేశారు. లిక్కర్ స్కాంలో సంబంధమే లేకపోతే... అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్రా రెడ్డితో జరిగిన లావా దేవీల సంగతి గురించి ప్రశ్నించారు. మహబూబ్ నగర్ లోని రూ.14 కోట్ల వ్యవసాయ భూమిని ఎందుకు శరత్ చంద్రారెడ్డి కొనుగోలు చేసేలా ఒత్తిడి చేశారని ఆరా తీసింది. అలాగే, తెలంగాణ జాగృతికి సిఎస్ఆర్ రూంలో శరత్ చంద్రా రెడ్డి ఇచ్చిన రూ. 80 లక్షలపై పలు ప్రశ్నలు సందించింది. రౌస్ ఎవెన్యూ కోర్టు ఇచ్చిన కస్టడి సమయం ఆదివారంతో ముగియడంతో... కవితను ఆదివారం ఉదయం 10 గంటలకు సిబిఐ అధికారులు కోర్టులో హాజరుపరుచనున్నారు.

2 లక్షలకు పైగా ఖాతాలు తొలగించిన ఎక్స్

న్యూఢిల్లీ : ప్రముఖ సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) భారత్‌లో సుమారు 2 లక్షలకు పైగా ఖాతాలను తొలగించింది. ఐటీ నియమాలు 2021 ఉల్లంఘన కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 25 మధ్య మొత్తం 2,12,627 ఖాతాలను తొలగించినట్లు ఎక్స్ ప్రకటించింది. వీటిలో చిన్నారులపై లైంగిక వేధింపులను, నగ్న దృశ్యాలు ప్రోత్సహించే ఖాతాలు ఉన్నాయని తెలిపింది. సంస్థ తన నెలవారీ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 'భారత్‌లోని యూజర్ల నుంచి 5,158 ఫిర్యాదులను స్వీకరించాం. వాటిలో 86 ఫిర్యాదుల్ని ప్రాసెస్ చేశాం. పరిశీలన అనంతరం వాటిలో 7 అకౌంట్లను రద్దు చేశాం" అని 'ఎక్స్' తెలిపింది. భారత్ యూజర్ల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో వేధింపులు (3,074), ద్వేషపూరిత ప్రవర్తన (412), అడల్ట్ కంటెంట్ (953) వేధింపులు (359).. వంటి అంశాలకు సంబంధించినవి ఉన్నాయని పేర్కొంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేలా ఉన్న 1,235 ఖాతాలను తొలగించినట్లు వెల్లడించింది. అలాగే, ఈ ఏడాది జనవరి 26 నుంచి ఫిబ్రవరి 25 మధ్య 5,06,173 ఖాతాలను ఎక్స్ తొలగించిన విషయం తెలిసిందే. వీటిలో 1,982 ఖాతాలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయని తెలిపింది.

రాయి కలకలం

(మొదటి పేజీ తరువాయి)

జరిగి 24 గంటలైనా ఎందుకు డిజిపి, ఇంటెలిజెన్స్ యాక్షన్ తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశాడు. జగన్‌పై దాడిని తాను ఖండించానని, తనపై రాయి వేస్తే జగన్ ఖండించడా? అని ప్రశ్నించారు. బిజెపి, టిడిపి, జనసేన కూటమికి 2024 ఎన్నికల్లో తిరుగేలేదని, రాష్ట్రంలో జగన్‌ను వదిలించుకోవాలని ప్రజలు చూస్తున్నారని అన్నారు. తాను విశాఖను పరిశ్రమల కేంద్రంగా తయారు చేస్తే, జగన్ గంజాయికి కేంద్రంగా మార్చారని విమర్శించారు. అప్పట్లో వాజ్‌పేయి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామంటే తాను అడ్డుపడ్డానని తెలిపారు. తమ కూటమికి ఓట్లేస్తే ప్రైవేట్‌పరం కాకుండా కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.



మా బడి



సరదా ఆటలు
పసందైన పాటలు
విజ్ఞాన యాత్రలు
మా బడి అంటే మాకిష్టం!

నీతి పద్యాలు
అభినయ గేయాలు
ఉత్సాహపు నృత్యాలు
మా బడి అంటే మాకిష్టం!

సైన్స్ ప్రయోగాలు
బొమ్మల తయారీలు
సృజనాత్మక కృత్యాలు
మా బడి అంటే మాకిష్టం!

చక్కటి క్రమశిక్షణ
చదువులో మంచి శిక్షణ
గురువుల ఆదరణ
మా బడి అంటే మాకిష్టం!

- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240.

పదాలు కనిపెట్టండి!

పిల్లలూ, కింద ఇచ్చిన ఆంగ్ల అక్షరాల్లో పక్కనే ఇచ్చిన పదాలు గజిబిజిగా ఉన్నాయి. ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం.

j	e	i	m	e	f	z	l	z	k
s	s	e	c	n	i	r	p	n	i
l	i	l	y	p	a	d	o	t	s
l	l	a	b	p	o	n	d	g	s
w	x	o	n	h	r	h	d	z	b

ball
frog
kiss
lily pad
pond
princess

నేను గీసిన బొమ్మ



కె.డోలా నాగ శ్రీనిధి,
6వ తరగతి,
వంశీ హైస్కూలు, ఉండవల్లి సెంటర్,
గుంటూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family



గుల్ఫిషా ఫాతిమా ... ఉన్నత విద్యావంతురాలు. సామాజిక కార్యకర్త, చరిత్ర పరిశీలకురాలు. బిజెపి ప్రభుత్వం ప్రకటించిన వివాదస్పద పౌరసత్వ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన యువతి. నాలుగేళ్లుగా తీహారు జైల్లో అక్రమ నిర్బంధంలో ఉంది. అయినా, ఆమె అదరలేదు. బెదరలేదు. ఎత్తయిన జైలు గోడల మధ్య నుంచి తన బొమ్మల ద్వారా, కవితల ద్వారా స్వేచ్ఛాస్వరాన్ని వినిపిస్తోంది. దేశానికి తన సందేశాన్ని పంపిస్తోంది.

జైలు గోడల మధ్యలోంచి స్వేచ్ఛాస్వరం!

2020లో ఢిల్లీ షహీన్‌బాగ్ ఆందోళనల్లో పోరాడుతున్న మహిళలకు మద్దతుగా నిలబడింది గుల్ఫిషా ఫాతిమా. ఆ సందర్భంగా కొంతమంది బిజెపి నాయకులు, మంత్రులు చేసిన విద్వేష ప్రకటనలు ఈశాన్య ఢిల్లీలో అల్లర్లను సృష్టించాయి. 54 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగింది. ఆ అల్లర్లకు సూత్రధారి గుల్ఫిషా ఫాతిమా అని పోలీసులు కేసులు బనాయించారు. 2020 ఏప్రిల్ 9వ తేదీన అరెస్టు చేశారు. ఆ కేసులో మే 13వ తేదీన కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ తరువాత కొద్దిరోజుల్లోనే పాలకులు ఆమె మీద మోపిన హత్య, అల్లర్ల కేసును దేశద్రోహం కేసుగా మార్చేశారు. కఠినమైన చట్టాన్ని ప్రయోగించి, ఆమెను కారాగారానికే పరిమితం చేశారు. బనాయించిన కేసుపై ఇప్పటివరకూ ఏ ఆధారమూ లేదు. ఎలాంటి విచారణా లేదు. నాలుగేళ్ల నుంచి ఆమె తీహారు జైల్లోనే మగ్గుతోంది. డెబ్బయ్ ఐదేళ్ల స్వాతంత్ర్య భారతంలో ప్రజాస్వామ్యం ఇంత ఘనంగా వర్ధిల్లుతోంది.


చురుకైన, తెలివైన విద్యార్థి

స్నేహితులు ముద్దుగా గుల్ అని పిలుచుకునే గుల్ఫిషా ఫాతిమా చిన్నప్పటినుంచీ చాలా చురుకైన అమ్మాయి. తెలివైన విద్యార్థి. అమ్మానాన్న ఢిల్లీలోనే ఒక జనరల్ స్టోర్ నడుపుతారు. గుల్‌కి ఒక సోదరుడు కూడా ఉన్నాడు. పేరు అకిల్ హుసేన్. వారిది ఏ చీకూ చింతా లేని కుటుంబం. అంతా హాయిగానే గడిచిపోతుంది. గుల్ ఢిల్లీ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసింది. తరువాత ఎంబిఎ కూడా పూర్తి చేసింది. సమాజానికి ఏదైనా మేలు చేయాలని తపన పడేది. బిజెపి ప్రభుత్వం వివక్షాపూరితమైన పౌరసత్వ చట్టాలను ముందుకు తెచ్చినప్పుడు - వాటి గురించి చాలా అధ్యయనం చేసింది. ఆ చట్టం నిండా వివక్ష ఉందని అర్థం చేసుకొంది. ఆ చట్టాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనటం మొదలు పెట్టింది.

ఢిల్లీ షహీన్‌బాగ్‌లో పెద్దఎత్తున మహిళలు సిఎఎ, ఎన్నార్సీ వ్యతిరేక నిరసనలు జరుపుతున్నప్పుడు ఆ శిబిరాల్లో తన మిత్రులతో కలిసి పాల్గొంది. ఆ చట్టాల్లో ఉన్న వివక్ష గురించి, దురుద్దేశాల గురించీ మహిళలకు వివరిస్తూ మాట్లాడింది. రోజుల తరబడి ఆ నిరసనల్లో పాల్గొంటూ, ఆ మహిళలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు చేపట్టింది. వారికి ఇంగ్లీషు తరగతులు బోధించింది. వివిధ చట్టాల గురించి, హక్కుల గురించీ వివరించింది. చారిత్రిక విషయాలను విశదపరిచింది.

గుల్ అలాంటి పాత్ర పోషించటం బిజెపి ప్రభుత్వానికి ససేమిరా నచ్చలేదు. ఆ నిరసనలు చెక్కుచెదరకుండా అన్నన్ని రోజులు కొనసాగటం అసలే నచ్చలేదు. రకరకాల నిర్బంధాలూ, నీచ ప్రచారాలూ ప్రయోగించినా, మహిళల్లో స్ఫూర్తి ఇసుమంత కూడా తగ్గలేదు. తొంబై ఏళ్ల ముదుసమ్మలు కూడా క్రమం తప్పకుండా శాంతియుత నిరసనల్లో పాల్గొనటం బిజెపి ప్రభుత్వానికి మింగుడు పడలేదు.

ఆ తరువాతి కొద్దిరోజులకే ఈశాన్య ఢిల్లీలో అల్లర్లు మొదలయ్యాయి. బలవంతాన నిరసన శిబిరాలను తొలగించారు. గుల్ మీద, ఇతర సామాజిక కార్యకర్తల మీదా పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. 2020 ఏప్రిల్ 9వ తేదీన గుల్ఫిషా ఫాతిమాను అరెస్టు చేశారు. ఏవేవో నిషేధిత సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు ప్రచారం చేశారు. ఉగ్రవాద నిరోధక చట్టం - ఉపా కింద కఠినమైన సెక్షన్లు ప్రయోగించారు. తీహార్ జైల్లో బంధించారు. బెయిలు కోసం ఆమె పెట్టుకున్న పిటీషన్‌పై కూడా ఇంతవరకూ విచారణ చేపట్టలేదు.



చెక్కు చెదరని ధైర్యం

నాలుగేళ్ల నుంచి తీవ్ర నిర్బంధంలో ఉన్నప్పటికీ, ఆమె విశ్వాసం కోల్పోలేదు. అధైర్యపడలేదు. దేశ పాలకుల్లో ఎంత విద్వేషం ఉందో, ఎంత నిరంకుశత్వం పేట్రేగిపోతుందో తన నిర్బంధం ఒక ఉదాహరణగా పేర్కొంటోంది. గుల్ఫిషా ఫాతిమా మంచి చదువరి. భావుకురాలు. కవయిత్రి, చిత్రకారిణి కూడా. జైలు నాలుగు గోడల మధ్యా తనదైన ప్రపంచాన్ని సృష్టించుకొని, స్వేచ్ఛాకాశాన్ని కలలు కంటోంది. ఆ కలలను తన చిత్రకళ ద్వారా వెల్లడిస్తోంది. ఆమె గీస్తున్న బొమ్మలు చేయి తిరిగిన ఆర్టిస్టును తలపిస్తున్నాయి. తాను కఠిన కారాగారంలో బందీ అయినప్పటికీ- తన బొమ్మలకు రెక్కలు తొడుగుతోంది. శాంతిని, సామరస్యాన్ని అభిలషించే తెల్ల పావురాలను చిత్రిస్తోంది.

హిందీలో చక్కని కవిత్వం కూడా రాస్తోంది. నిరంకుశం, నిర్బంధం కూలిపోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తోంది. తెలుగులోకి అనువదించిన కొన్ని కవితలను ఇవి.

మరుపు

పరీక్షల కోసం నేను
చరిత్రనంతా బట్టీ పడతా
కానీ, ఎప్పుడూ తారీఖులు మర్చిపోతుంటా
ఇప్పుడు నేను
మిగిలినదంతా మర్చిపోయా
కేవలం తారీఖులు మాత్రమే గుర్తు పెట్టుకున్నా!

(చరిత్ర అంటే తారీఖులూ దస్తావేజులూ కాదన్నాడు మహాకవి శ్రీశ్రీ. చరిత్ర సారాంశమూ, దాని నిర్మాణంలో ప్రజల చైతన్యమే ముఖ్యం. కానీ, నిరంకుశ పాలకుల ఏలుబడిలో లెక్కలకు, కొలతలకే ప్రాధాన్యం ఉంటుంది మరి!)

చుట్టూ ఉన్న గోడలు

నా చుట్టూ ఉన్న నాలుగు గోడలు
ఇంత మౌనంగా ఉన్నాయేమిటి?
ఇంత కాలం ఇవి నెత్తి మీద
తుపానులు, ఈదురు గాలులు
మాడ్చేసే ఎండలు భరిస్తూ
ఎలా తట్టుకుని ఉన్నాయి
అయినా ఇవి నోరు ఎందుకు విప్పడం లేదు
లేదు.. ఇవి మాట్లాడతాయనుకుంటా ...
గోడలు బీట్లిచ్చి, మట్టి పెళ్లలు, సుద్దలు
రాలిపడినప్పుడు
ఇవి ఏదో చెప్తున్నట్లు ఉంటాయి
కానీ, యజమాని వచ్చి మరమ్మతులు చేయించి
వీటి నోళ్లు మూయించేస్తాడు
చిరాఖరికి ఏదో ఒక రోజు ఈ భారంతో
గోడలు కూలిపోతాయి
వాటి స్థానే మళ్ళీ కొత్తగా
మౌనం పాటించే గోడలే కడతారు!

(గోడలకు కూడా చైతన్యాన్ని ఆపాదిస్తోంది గుల్. అవి పెచ్చులూడిపోవడం, కూలిపోవడం వాటి నిరసనకు, స్వేచ్ఛాకాంక్షకూ నిదర్శనం అంటోంది.)


కటిక చీకటి రాత్రి

నిన్న రాత్రి చీకట్లో
జైలు తలుపుల మీద
ప్రేమించిన వారి ప్రతిధ్వనుల మాదిరిగా
మలయ మారుత పవనాల తాకిడి
మెరుపుల్లా
మమ్మల్ని విడుదల చెయ్యమనే డిమాండ్లతో
కూడిన
అభ్యర్థనల తాకిడులు
చిగురు కొమ్మల నిర్వేదం
ఎన్నో విఫల యత్నాల తర్వాత
నిగ్రహించుకోలేని జలతారు వర్షంలా
కన్నీటి ప్రవాహం
వెల్లువెత్తిన ఆరోపణల మాదిరిగా
నేల మీద చిందిన
నీటి బిందువుల శబ్దం
చెవులు వినపడని పాములు
విషపు కోరలు సాచి
పడగలు విప్పి మరీ
చేస్తున్న నత్యం
పిడికిలి బిగించిన పీడితులు
ఇంకా ఆ కటిక చీకటిలోనే మగ్గిపోతున్నారు!

(సహజమైన గాలిలో, వానలో, ఎండలో మానవీయమైన స్పందనను చూస్తోంది గుల్ఫిషా ఫాతిమా. అదే సమయంలో నిరంకుశులైన పాలక భుజంగాలకు అవేమీ వినబడ్డం లేదని విమర్శిస్తోంది. పిడికిలి బిగించిన పీడితుల నిర్బంధంపై ఆవేదన చెందుతోంది. స్వేచ్ఛాయుతమైన, ప్రజాస్వామికమైన వాతావరణాన్ని ఆకాంక్షిస్తోంది.)

ప్రశ్నను భరించలేని, ప్రజా చైతన్యాన్ని సహించలేని పాలకులకు ప్రజలే బుద్ధి చెప్పాలి. ఓటు అనే ఆయుధాన్ని అందుకోసం ప్రయోగించాలి. అప్పుడే అక్రమ, అన్యాయపు సంకెళ్లకు కనువిప్పు.

- శాంతిమిత్ర





జగన్, చంద్రబాబు ఇద్దరూ మోడీకి బానిసలు

- 'ఇండియా'తోనే ప్రత్యేక హోదా సాధ్యం
- ప్రతి పేద మహిళకు ఏడాదికి లక్ష
- పిసిసి అధ్యక్షురాలు షర్మిల



సభలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

వైసిపి అధినేత జగన్.. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇద్దరూ నరేంద్ర మోడీకి బానిసలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ఏ నాడూ ప్రత్యేక హోదా గురించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదని తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, సత్యవేడులో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. ఇండియా వేదికతోనే ప్రత్యేక హోదా సాధ్యమని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్య తీర్చడానికి 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మొదటి సంతకం పెడతానని చెప్పారు. చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి తమ స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని మోడీకి తాకట్టు పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టు, దుగ్గిరాజుపట్నం ఓడరేవు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంటు, మన్నవరం విద్యుత్ ఉపకరణాల తయారీ ప్రాజెక్టు, కనీసం రాష్ట్రానికి రాజధాని కూడా లేకపోవడం బాధాకరమని తెలిపారు. జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని విస్మరించారన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి అమ్మఒడి ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ప్రతి ఏడాది జాబ్ కేలండర్, మెగా డిఎస్‌సి అని నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల వేళ 6 వేల పోస్టులతో దగా డిఎస్‌సి నిర్వహించడానికి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు.

ఎవరైనా ఎన్నికలకు రెండు నెలల ముందు డిఎస్‌సికి నోటిఫికేషన్ ఇస్తారా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో ఏడు పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు, రెండు సార్లు ఆర్‌టిసి ఛార్జీలు పెంచారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్యుల బతుకు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు.

ఇండియా వేదిక అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సాయం, 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. వద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు చొప్పున పింఛను అందజేస్తామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. ప్రతి ఓటరు ఆలోచించి మంచి చేసే వారికి ఓటు వేయాలని షర్మిల విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు, తిరుపతి ఎంపి అభ్యర్థి డాక్టర్ చింతామోహన్, సత్యవేడులో ఎమ్మెల్యే అభ్యర్థి బాలాగురు బాబుని ప్రజలు గెలిపించాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు షెడ్యూల్ విడుదల

- 18 నుంచి ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు వివరాలను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. మే 24 నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 18 నుంచి 24 వరకు ఫీజు చెల్లించవచ్చునని విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సబ్జెక్టులతో సంబంధం లేకుండా రూ.550 చెల్లించాలని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు రూ.250, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలని వివరించారు. అదేవిధంగా రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు కూడా ఈ తేదీల్లోనే ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల రీ వెరిఫికేషన్‌కు రూ.1300, రీ కౌంటింగ్‌కు రూ.260 చెల్లించాలని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంప్రూవ్‌మెంటు రాయాలనుకుంటే రూ.1100 చెల్లించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షకు రూ.500, బ్రిడ్జి కోర్సుకు రూ.300 అని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి ఇంప్రూవ్‌మెంటు రాయాలనుకుంటే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1240, సైన్స్ విద్యార్థులు రూ.1440 చెల్లించాలని వివరించారు.

రవాణా రంగ కార్మికుల ఊసే లేని బిజెపి మేనిఫెస్టో

- ఆర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో బిజెపి విడుదల చేసిన మేనిఫెస్టోలో రవాణా రంగ పరిరక్షణ, అసంఘటిత రవాణా రంగ కార్మికుల స్థితిగతులు, సామాజిక సంక్షేమ చట్టం గురించి ప్రస్తావన లేదని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని రవాణా రంగ కార్మికులకు ఆయన విజ్ఞప్తి చేశారు. మోడీ పదేళ్ల పాలనలో కల్పించిన ఉద్యోగాల కంటే ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య గణనీయంగా ఉందన్నారు. అనేక రాష్ట్రాల్లో ప్రైవేటు బస్సులు, ఆటో, రిక్షాల సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా తగ్గడంతో వారంతా జీవనోపాధి కోల్పోయారని అన్నారు.

టిడిపి అసంతృప్తులకు 'బాధ్యతలు'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపిలో టికెట్ దక్కని దేవినేని ఉమామహేశ్వరరావు తదితర అసంతృప్తి నేతలకు పార్టీ పదవులు దక్కాయి. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం అర్బన్ టికెట్ ఆశించిన ప్రభాకర్ చౌదరికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శితోపాటు జోన్-5 ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. పెదకూరపాడు టికెట్ ఆశించిన కొమ్మాలపాటి శ్రీధర్‌కు నరసరావుపేట పార్లమెంటు అధ్యక్షులుగా, ఆదోని టికెట్ ఆశించిన కె మీనాక్షి నాయుడుకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, సత్తెనపల్లి టికెట్ కోరిన కోడెల శివరామకృష్ణను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, మైలవరం, విజయవాడ వెస్ట్, తిరువూరు, టికెట్లు ఆశించిన బొమ్మసాని సుబ్బారావు, ఎంఎస్ బేగ్‌లకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించింది. ఇటీవల పార్టీలో చేరిన దాడి వీరభద్రరావుకు ఎన్నికల సంఘం, కేంద్ర కార్యాలయం సమన్వయకర్తగా నియమించింది. విజయవాడకు చెందిన బొప్పన భవకుమార్, గుంటూరుకు చెందిన తాడిశెట్టి మురళీమోహన్‌కు కూడా కార్యనిర్వాహక కార్యదర్శులుగా, మల్లెల రాజేష్ నాయుడును గుంటూరు వెస్ట్ నియోజకవర్గం, శీతంరాజు సుధాకర్‌కు విశాఖపట్నం నార్త్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. వీరితోపాటు 49 మందికి పార్టీలో వివిధ పదవులు కేటాయించారు. హిందూపురం ఎంపి టికెట్ ఆశించిన నిమ్మల క్రిష్టప్పకు అనంతపురం పార్లమెంటు ఎన్నికలు సమన్వయకర్తగా నియమించింది. కర్నూలు సిట్టింగ్ ఎంపి సంజీవ కుమార్‌కు కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది.

సాల్ట్ చితకొట్టాడు

- కోల్‌కత చేతిలో లక్నో చిత్తు
- ఫిల్ సాల్ట్ అజేయ అర్ధ సెంచరీ
- రాణించిన మిచెల్ స్టార్క్, నరైన్
- లక్నో 161/7, కోల్‌కత 162/2

ఈడెన్‌గార్డెన్స్‌లో నైట్‌రైడర్స్ ఈల వేసింది. లక్నో సూపర్‌జెయింట్స్‌ను చిత్తు చేసి ఐపీఎల్ 17వ సీజన్లో నాల్గో విజయం నమోదు చేసింది. ఫిల్ సాల్ట్ (89 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో 162 పరుగుల ఊరించే లక్ష్యాన్ని కోల్‌కత ఊదేసింది. 15.4 ఓవర్లలోనే లాంఛనం ముగించింది. మిచెల్ స్టార్క్ (3/28), సునీల్ నరైన్ (1/17) మ్యాజిక్‌తో తొలుత లక్నో సూపర్‌జెయింట్స్ 161 పరుగులకే పరిమితమైంది. బ్యాట్‌తో, బంతితో లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఎదురులేని ప్రదర్శన చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. ఫిల్ సాల్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



కోల్‌కత : ఫిల్ సాల్ట్ (89 నాటౌట్, 47 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (38 నాటౌట్, 38 బంతుల్లో 6 ఫోర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌తో రాణించగా.. 162 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కత నైట్‌రైడర్స్ మరో 26 బంతులు మిగిలి ఉండగానే ముగించింది. ఐపీఎల్ 17వ సీజన్‌లో ఐదు మ్యాచుల్లో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఇది నాల్గో విజయం కావటం విశేషం. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 161 పరుగులే చేసింది. పేసర్ మిచెల్ స్టార్క్ (3/28), స్పిన్నర్ సునీల్ నరైన్ (1/17) సూపర్‌జెయింట్స్ బ్యాటర్లను కట్టడి చేశారు. నికోలస్ పూరన్ (45, 32 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) సూపర్‌జెయింట్స్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. లక్నోకు ఆరు మ్యాచుల్లో ఇది మూడో పరాజయం కావటం గమనార్హం.

చెలరేగిన సాల్ట్ : ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న జట్లలో కోల్‌కత నైట్‌రైడర్స్ ఒకటి. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో నైట్‌రైడర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. 200 పైచిలుకు లక్ష్యాలు సైతం కోల్‌కత ముందు నిలువటం లేదు!. ఆదివారం ఈడెన్‌గార్డెన్స్‌లో కోల్‌కత ముందు లక్నో 162 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. నైట్‌రైడర్స్ సహజంగానే 15.4 ఓవర్లలోనే లాంఛనం ముగించింది. పించ్ హిట్టింగ్ టాప్ ఆర్డర్ బ్యాటర్లు సునీల్ నరైన్ (6), రఘువంశీ (7) నిరాశపరిచారు. ఫిల్ సాల్ట్‌తో కలిసి నరైన్ తొలి వికెట్‌కు 22 పరుగులు జోడించగా.. రఘువంశీ రెండో వికెట్‌కు 20 పరుగులు జత చేశాడు. లక్నో పేసర్ మోషిన్ ఖాన్ వరుస ఓవర్లలో రెండు వికెట్లతో మెరిసినా.. ఫిల్ సాల్ట్ ముందు లక్నో వ్యూహం ఫలించలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (38 నాటౌట్)తో జతకలిసిన సాల్ట్ మూడో వికెట్‌కు అజేయంగా 76 బంతుల్లోనే 120 పరుగులు జోడించాడు. ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన సాల్ట్ ఆ తర్వాత వేగం మరింత పెంచాడు. ఓ ఎండ్‌లో శ్రేయస్ అయ్యర్ ఇబ్బంది పడ్డాడు. భారీ షాట్లు ఆడలేకపోయాడు. కానీ సాధించాల్సిన రన్‌రేట్ తక్కువగా ఉండటంతో పెద్దగా రిస్క్ సైతం తీసుకోలేదు. జోరుమీదున్న సాల్ట్‌కు సహకారం అందిస్తూ స్ట్రయిక్ రొటేషన్ చేశాడు. పవర్‌ప్లేలో విశ్వరూపం చూపించిన సాల్ట్.. ఆ తర్వాత సైతం క్రమం తప్పకుండా బౌండరీలు బాదాడు. 160 పైచిలుకు లక్ష్యాలను కాపాడుకోవటంలో లక్నోకు ప్రత్యేక రికార్డు ఉంది. గత రెండు మ్యాచుల్లో ఆ జట్టు ఆ రికార్డును కాపాడుకోలేదు. గతి తప్పిన బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించారు. ఎక్స్‌ట్రాల రూపంలోనే లక్నో ఏకంగా 22 పరుగులు కోల్పోయింది. మోషిన్ ఖాన్ (2/29) మినహా సూపర్‌జెయింట్స్ బౌలర్లలో ఎవరూ రాణించలేదు.

ఆదుకున్న పూరన్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఓపెనర్లు ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. క్వింటన్ డికాక్ (10), దీపక్ హుడా (8) పవర్‌ప్లేలోనే నిష్క్రమించారు. కెప్టెన్ కెఎల్ రాహుల్ (39, 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుశ్ బదాని (29, 27 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) లక్నో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కానీ పేసర్ మిచెల్ స్టార్క్, స్పిన్నర్ సునీల్ నరైన్ మ్యాజిక్ ముందు తేలిపోయారు. పరుగుల వేటలో వెనుకంజ వేసిన సూపర్‌జెయింట్స్ ఏ దశలోనూ ప్రమాదకరంగా కనిపించలేదు. మార్కస్ స్టోయినిస్ (10) సైతం నిరాశపరచగా.. డెత్ ఓవర్లలో నికోలస్ పూరన్ (45) ఆదుకున్నాడు. నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో మెరిసిన పూరన్ లక్నో సూపర్‌జెయింట్స్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టిన నైట్‌రైడర్స్.. లక్నో సూపర్‌జెయింట్స్‌ను 161 పరుగులకే పరిమితం చేసింది.

స్కోరు వివరాలు :

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ : డికాక్ (సి) నరైన్ (బి) అరోర 10, రాహుల్ (సి) రమన్‌దీప్ (బి) రసెల్ 39, దీపక్ హుడా (సి) రమన్‌దీప్ (బి) స్టార్క్ 8, ఆయుశ్ బదాని (సి) రఘువంశీ (బి) నరైన్ 29, స్టోయినిస్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 10, నికోలస్ పూరన్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 45, కృనాల్ పాండ్య నాటౌట్ 7, అర్షద్ ఖాన్ (బి) స్టార్క్ 5, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 161.

వికెట్ల పతనం : 1-19, 2-39, 3-78, 4-95, 5-111, 6-155, 7-161.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 4-0-28-3, వైభవ్ అరోర 3-0-34-1, హర్షిత్ రానా 4-0-35-0, సునీల్ నరైన్ 4-0-17-1, వరుణ్ చక్రవర్తి 4-0-30-1, ఆండ్రీ రసెల్ 1-0-16-1.

కోల్‌కత నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ : ఫిల్ సాల్ట్ నాటౌట్ 89, సునీల్ నరైన్ (సి) స్టోయినిస్ (బి) మోషిన్ ఖాన్ 6, రఘువంశీ (సి) రాహుల్ (బి) మోషిన్ ఖాన్ 7, శ్రేయస్ అయ్యర్ నాటౌట్ 38, ఎక్స్‌ట్రాలు : 22, మొత్తం : (15.4 ఓవర్లలో 2 వికెట్లకు) 162.

వికెట్ల పతనం : 1-22, 2-42.

బౌలింగ్ : షమర్ జోసెఫ్ 4-0-47-0, మోషిన్ ఖాన్ 4-0-29-2, కృనాల్ పాండ్య 1-0-14-0, యశ్ ఠాకూర్ 2-0-25-0, అర్షద్ ఖాన్ 2-0-24-0, రవి బిష్ణోయ్ 2.4-0-17-0.

ఐపీఎల్‌లో నేడు..
బెంగళూర్ X హైదరాబాద్ - వేదిక : బెంగళూర్

టీ20 విజేత సిఎఫ్‌సి

హైదరాబాద్: నెక్ట్స్ జెన్ ఉమెన్స్ టీ20 ట్రోఫీని సెంటర్ ఫర్ క్రికెట్ (సీఎఫ్‌సీ) ఎక్స్‌లెన్స్ అకాడమీ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో కోచింగ్ బియాండ్‌పై సీఎఫ్‌సీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత కోచింగ్ బియాండ్ (సీబీ) 20 ఓవర్లలో 121కు ఆలౌటైంది. ఛేదనలో సీఎఫ్‌సీ టీమ్ 15.5 ఓవర్లలో 122/1 పరుగులు చేసింది. ఓపెనర్ రమ్య (72), ఆల్‌రౌండర్ జి.త్రిషా రెడ్డి (3/18, (44) రాణించారు. 310 పరుగులు, 11 వికెట్లు తీసిన త్రిష టోర్నీ అత్యంత విలువైన ప్లేయర్‌గా నిలిచింది. సీఎఫ్‌సీ జట్టును కోచ్‌లు జగదీశ్ రెడ్డి, షానవాజ్ అభినందించారు.

అగ్రస్థానంలో గుకేశ్

- ఫిడె క్యాండిడేట్స్ టెస్

టోరంటో (యుఎస్‌ఏ) : భారత గ్రాండ్‌మాస్టర్ డి.గుకేశ్ ఫిడె క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్ మ్యాచ్‌లో సహచర గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతిపై గెలుపొందాడు. టూ నైట్స్ డిఫెన్స్‌లో 38 ఎత్తుల్లోనే విదిత్‌పై గుకేశ్ గెలుపొందాడు. మరో కీలక మ్యాచ్‌లో ఆర్. ప్రజ్ఞానంద 40 ఎత్తుల్లో అలిరెజా (ఫ్రాన్స్)తో డ్రా చేసుకున్నాడు. ఫాబియానో (యుఎస్‌ఏ)పై హికరు నకమురు (యుఎస్‌ఏ) గెలుపొందగా.. ఐయాన్, నిజత్ మ్యాచ్ డ్రా గా ముగిసింది. ఎనిమిది రౌండ్ల అనంతరం ఐయాన్ (రష్యా)తో కలిసి గుకేశ్ (5.0) అగ్రస్థానంలో నిలువగా.. ప్రజ్ఞానంద (4.5) నాల్గో స్థానంలో నిలిచాడు. విదిత్ గుజరాతి (3.5) ఆరో స్థానంలో ఉన్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68